ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

ఆదివారం 25 ఆగస్టు 2024



# వారంలోగా భద్రతా ఆడిట్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్. చిత్రంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

- లోటుపాట్లు గుర్తించి సరిచేసుకోవాలి
- వచ్చే నెల 30లోగా మాక్ డ్రిల్స్ నిర్వహించాలి
- ప్రతి కంపెనీలో అలారం సిస్టమ్ తప్పనిసరి
- ఉద్యోగులు, కార్మికుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం
- పని ప్రదేశంలో రక్షణ చర్యలు తీసుకోవాలి
- పరిశ్రమల నిర్వాహకులకు కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశాలు
- అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తుండాలి

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):

**కార్మికులు, ఉద్యోగుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తూ పరిశ్రమలు నిర్వహించాలని, పని ప్రదేశంలో అన్ని రకాల రక్షణ చర్యలు తీసుకోవాలని యాజమాన్యాలను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్ ఆదేశించారు. ఇటీవల ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో జిల్లాలోని 57 పరిశ్రమల నిర్వాహకులతో శనివారం కలెక్టరేట్‌లో సీపీ శంఖబ్రత బాగ్చీతో కలిసి సమావేశం నిర్వహించారు.**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల్లో వారం రోజుల్లో భద్రతా ఆడిట్ నిర్వహించి లోటుపాట్లు గుర్తించి వాటిని సరిచేయాలని సూచించారు. వచ్చే నెల 30వ తేదీలోగా అన్నిచోట్ల మాక్ డ్రిల్స్ నిర్వహించాలని, ప్రమాదాలపై కార్మికులు, సమీప నివాసితులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కంపెనీలో అలారం సిస్టమ్ తప్పకుండా ఏర్పాటుచేయాలన్నారు. ఉద్యోగులు, కార్మికులు ప్రశాంత వాతావరణంలో ధైర్యంగా పని చేసుకునేలా నిర్వాహకులు, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనుకోని సంఘటన జరిగితే ప్రథమ చికిత్స చేయడానికి కిట్లు అందుబాటులో ఉంచాలని, అందుకు ఒక ఇన్‌చార్జిని నియమించుకోవాలన్నారు. అటువంటి పరిస్థితుల్లో కార్మికులు, ఉద్యోగులు స్వీయ రక్షణ పొందేలా శిక్షణ ఇవ్వాలన్నారు. నిబంధనల అమలులో అధికారులు రాజీపడవద్దన్నారు. ఉద్యోగులు, కార్మికుల సంరక్షణ బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు సమాచార మార్పిడి, ప్రమాద నివారణకు సూచనలు పంచుకోవడానికి ప్రత్యేకంగా పోర్టల్ ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అన్ని రకాల పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, నిబంధనలు అతిక్రమించడానికి వీల్లేదని స్పష్టంచేశారు. జిల్లాలో 57 పరిశ్రమలలో సంబంధిత విభాగాల అధికారులు తరచూ తనిఖీలు చేయాలని, లోపాలుంటే వెంటనే నోటీసులు ఇవ్వాలన్నారు. త్వరలో జాయింట్ తనిఖీ బృందాన్ని నియమిస్తామన్నారు. భద్రతా ఆడిట్, మాక్ డ్రిల్, కనీస వసతుల కల్పన వంటి అంశాలను బృందం తనిఖీ చేస్తుందన్నారు. ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలు నిర్వహించి కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్య స్థితిని తెలుసుకుని తగిన వైద్యం అందించాలన్నారు. అక్టోబరు నెలాఖరు నాటికి అన్ని రకాల వసతులు కల్పించాలని ఆదేశించారు. ఎన్‌జీటీ ప్రమాణాలకు అనుగుణంగా వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రక్రియను నిర్వహించాలని కలెక్టర్ స్పష్టంచేశారు. కొందరు నేరుగా వ్యర్థాలను కాలువలు, సముద్రంలో విడిచిపెడుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని ఇటువంటి విధానానికి స్వస్తి చెప్పాలన్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ పరిశ్రమలలో ప్రమాదాలు జరిగినప్పుడు ... మిగతా 6వ పేజీలో

# ఫార్మా ప్రమాదాలపై అఖిలపక్షం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్
- యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలి



ఆస్పత్రిలో బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కె.రామకృష్ణ

**మహరాణిపేట, ఆగస్టు 24:** ఫార్మా కంపెనీల్లో జరుగుతున్న ప్రమాదాలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. పరవాడ ఫార్మాసిటీలోని 'సినర్జిన్' కంపెనీలో గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడి ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని శనివారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో రామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రమాదాలకు యాజమాన్యాలతో లాలూచీపడిన అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఫార్మా కంపెనీలలో సరైన భద్రతా చర్యలు, కార్మికులకు శిక్షణ సౌకర్యాలు లేవని అందువల్లే ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇవి ప్రమాదాలు కావని, యాజమాన్యాలు చేసిన హత్యలని వారిపై కేసు నమోదుచేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ఫార్మా కంపెనీల్లో తనిఖీలు నిర్వహించి ... మిగతా 6వ పేజీలో

# ఎసెన్షియా ఫార్మా కంపెనీలో ఉత్పత్తి నిలుపుదల

**అనకాపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలోని అచ్యుతాపురం సెజ్‌లో ఇటీవల ఘోర ప్రమాదం చోటుచేసుకున్న 'ఎసెన్షియా' అడ్వాన్స్‌డ్ సైన్స్ ఫార్మా కంపెనీలో ఉత్పత్తులను నిలిపివేస్తూ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మూడు రోజుల కిందట ప్రమాదం జరిగి 17 మంది మృతి చెందిన నేపథ్యంలో ఇప్పటికే కంపెనీలో అన్ని విభాగాలు మూతపడ్డాయి. కంపెనీలో జరిగిన ఘోర ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని నియమించి విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే.

# పరిశ్రమల ఇష్టారాజ్యం

## ఉద్యోగులు/కార్మికుల భద్రతకు ఏర్పాట్లు శూన్యం

- అధికారుల ఆదేశాలు బేఖాతరు
- సేఫ్టీ ఆడిట్ నిల్
- కనీసం సీసీ టీవీలు కూడా అమర్చుకోని వైనం
- ప్రమాదాలపై అధికారుల వద్ద కానరాని లెక్కలు
- 'ఎసెన్షియా' ఉదంతంతోనైనా పరిస్థితి మారేనా?



ఎసెన్షియాలో ప్రమాదం (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**పరిశ్రమల్లో భద్రతను గాలికి వదిలేశారు. నిబంధనాలు పాటించాలని, భద్రతపై ఆడిట్ నిర్వహించాలని, మాక్ డ్రిల్ చేయాలని అధికారులు కోరినా యాజమాన్యాలు సరిగ్గా స్పందించడం లేదు. భారీఎత్తున ఉత్పత్తులు చేస్తూ, వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న హెచ్‌పీసీఎల్, స్టీల్ ప్లాంటు వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు తప్ప ప్రైవేటు యాజమాన్యంలో నడిచేవి పట్టనట్టుగా ఉంటున్నాయి. నోటీసులు ఇస్తే రాజకీయ ఒత్తిళ్లు తీసుకువస్తున్నాయి. పాలకులు కూడా పెట్టుబడిదారులను ఇబ్బంది పెడితే... కొత్త పరిశ్రమలు రావని, ఉపాధి అవకాశాలు దొరకవని చూసీచూడనట్టుగా ఉంటున్నారు. చట్టంలో కూడా లొసుగులు ఉండడంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. భారీ ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరిగినప్పుడు ఒక వారం రోజులు హడావిడి చేస్తున్నారు. ఆ తరువాత ఆ విషయం వదిలేస్తున్నారు.**

**చట్టం ఏమి చెబుతున్నదంటే...?**

ప్రతి పరిశ్రమ తప్పనిసరిగా సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ఎసెన్షియా ప్రమాదం తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు. దాంతో విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వారం రోజుల్లో ప్రతి పరిశ్రమ సేఫ్టీ ఆడిట్ చేసి, నివేదికలు ఇవ్వాలని శనివారం ఆదేశించారు. పారిశ్రామిక సంస్థల సేఫ్టీ ఆడిట్‌పై కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి కలిసి మార్గదర్శకాలను తయారుచేశాయి. మాన్యుఫాక్చర్, స్టోరేజ్, ఇంపోర్ట్ ఆఫ్ హజార్డస్ కెమికల్స్ (ఎంఎస్ఐహెచ్‌సీ) నిబంధనలు 1989 ప్రకారం ప్రమాదకరమైన రసాయనాలు, పేలుడు పదార్థాలు ఉపయోగించే సంస్థలు ... మిగతా 6వ పేజీలో

**ఇవి తప్పనిసరి...**

- ఎసెన్షియాలో ప్రమాదం ఎలా జరిగిందో మూడు రోజులైనా స్పష్టత లేదు. సిబ్బంది చెప్పిందే నమ్మాల్సి వస్తోంది. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తరువాత ప్రతి చిన్న వ్యాపార సంస్థ సీసీ టీవీ కెమెరాలు పెట్టుకుంటోంది. కోట్ల రూపాయల వ్యాపారం చేస్తూ 40 ఎకరాల్లో విస్తరించిన ఎసెన్షియాలో ఒక్క సీసీ టీవీ కెమెరా కూడా లేదు. అమరావతి నుంచి సీఎం వెనుక వచ్చిన ఉన్నతాధికారులు దీనిపై ప్రశ్నిస్తే... యాజమాన్య ప్రతినిధులు పొంతన లేని సమాధానాలు చెప్పారు. సీసీ టీవీ కెమెరాలు పెట్టకూడదని సెలవిచ్చారు. ఎందుకు పెట్టకూడదు? ఎవరు చెప్పారు? అంటూ సెక్రటరీ స్థాయి అధికారి ప్రశ్నిస్తే మౌనమే సమాధానం అయింది. పరిశ్రమలు, ఫ్యాక్టరీస్, కార్మిక శాఖ అధికారులు కూడా ఇలాంటి అంశాలపై దృష్టిపెట్టలేదు. ఇకపై ప్రతి పరిశ్రమ ఆవరణలో సీసీ టీవీ కెమెరాలు పెట్టేలా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు.
- పరిశ్రమల్లో పనిచేసే వారికి సేఫ్టీ కిట్లు సరఫరా చేయాలి. హెల్మెట్ లేనిదే లోపలకు అనుమతించకూడదు. అలాగే కాళ్లకు బూట్లు వేసుకోవాలి. ప్రమాదకరమైన వాయువులు పీల్చకుండా నాణ్యమైన మాస్కులు ఉపయోగించాలి. చేతికి గ్లోవ్స్ ఉండాలి. కళ్లకు ఇబ్బంది కలగకుండా గాగుల్స్ ఇవ్వాలి. అయితే ఇవేమీ యాజమాన్యాలు సరఫరా చేయడం లేదు. ఎసెన్షియాలో రసాయనాలన్నీ మండిపోయి ఘాటైన వాసనలు వచ్చాయి. జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించడానికి వెళ్లినప్పుడు యాజమాన్యం వారికి సరైన కిట్లను గానీ, నాణ్యమైన మాస్కులు గానీ ఇవ్వలేకపోయింది. ఇలాంటి సంస్థల్లో పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ ప్రత్యేకంగా ఉండాలి. ప్రతి ఉద్యోగికి, విజిటర్లకు కూడా ఇవ్వాలి. కానీ వారు ఆ నిబంధన అమలు చేయడం లేదు. దాంతో చాలామంది ఉద్యోగులు ఆ విషవాయువులు పీల్చి అస్వస్థతకు గురయ్యారు.
- వాయువులు లీకైతే ఆ విషయాన్ని గుర్తించడానికి డిటెక్టర్లు పెట్టాలి.
- రియాక్టర్లలో ప్రెషర్, టెంపరేచర్ గుర్తింపునకు సెన్సార్లతో అనుసంధానం చేయాలి.
- ఎల్‌జీ పాలిమర్స్‌లో ప్రమాదం జరిగినపుడు సైరన్ కూడా మోగించలేదు. దీనిపై అప్పట్లో తీవ్రమైన చర్చ జరిగింది. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తే అందరినీ అప్రమత్తం చేయడానికి అలారం/సైరన్ మోగించాలని ఆదేశించారు. ఎసెన్షియాలో కూడా అలారం మోగలేదు. సైరల్ అలర్ట్ చేయలేదు. ఇవన్నీ ప్రాథమిక అంశాలు. వీటిని కూడా అధికారులు అమలు చేయలేకపోతున్నారు.

# వైసీపీ నేత బరితెగింపు

## దర్జాగా అక్రమ నిర్మాణం

భవనం నిర్మిస్తున్న స్థలంలో కొంతమేర గతంలో రోడ్డు విస్తరణకు సేకరించిన జీవీఎంసీ

- ప్రత్యామ్నాయంగా టీడీఆర్ జారీ
- అప్పట్లో అధికార పార్టీ అండ చూసుకుని స్థలం అప్పగించని యజమాని
- అదే భవనంపై అనధికారికంగా అదనపు అంతస్థు నిర్మాణం
- కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కొద్దికాలం పనులు నిలిపివేత
- తాజాగా మళ్లీ పునఃప్రారంభం
- చోద్యం చూస్తున్న జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు




మధురవాడలో జాతీయరహదారికి ఆనుకుని వైసీపీ నేత అక్రమ నిర్మాణం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**ఆయన వైసీపీలో చోటా నేత. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రోడ్డు విస్తరణ కోసం ఆయన భవనంలో కొంత స్థలాన్ని జీవీఎంసీ సేకరించాల్సి వచ్చింది. అందుకు పరిహారంగా టీడీఆర్ జారీచేసింది. టీడీఆర్ అందుకున్న ఆయన...స్థలాన్ని మాత్రం జీవీఎంసీకి అప్పగించలేదు. అంతేగాకుండా అదే భవనంపై అనధికారంగా మరో అంతస్థు నిర్మాణం ప్రారంభించారు. అధికారులు వెళ్లి పనులు నిలుపుదల చేయాలని కోరితే వారిపై తిరగబడ్డారు. వైసీపీ అధికారం కోల్పోవడంతో కొంతకాలం పనులు నిలిపివేశారు. తాజాగా మళ్లీ పనులు పునఃప్రారంభించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.**

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మధురవాడలో జాతీయ రహదారి జంక్షన్ నుంచి బక్కన్నపాలెం నవోదయ స్కూల్ వరకూ ప్రస్తుతం ఉన్న 40 అడుగుల రోడ్డును 80 అడుగులకు విస్తరించాలనుకున్నారు. రోడ్డు విస్తరణకు టౌన్‌ప్లానింగ్ అధికారులు 2023 ప్రారంభంలోనే సర్వే చేసి, రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ (ఆర్‌డీపీ) రూపొందించారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు విస్తరించేందుకు బక్కన్నపాలెం రోడ్డు కార్నర్‌లో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో కొంత భాగాన్ని తొలగించాల్సి వచ్చింది. ఆ భవనంలో దాదాపు 156 చదరపు మీటర్ల స్థలం రోడ్డు విస్తరణలో పోతుందని సర్వే చేసిన అధికారులు మార్కింగ్ చేశారు. మార్కింగ్ చేసిన మేర భవనాన్ని తొలగించి జీవీఎంసీకి స్థలాన్ని అప్పగించాలంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులు భవన యజమానికి నోటీసులు జారీచేశారు. స్వాధీనం చేసుకున్న స్థలానికి పరిహారంగా నాలుగు రెట్లు ఎక్కువ అంటే సుమారు 623.52 చదరపు మీటర్లు ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్)ను (నంబర్ 1086/00073/టీడీఆర్/ఎంవీడబ్ల్యూ/2023) 2023 జనవరిలో భవన యజమానికి అందజేశారు. అప్పటి నుంచి ఆ స్థలం అధికారికంగా జీవీఎంసీకి దఖలు పడినట్టే. ఆ మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు భవనంలో నిర్దేశిత నిర్మాణాన్ని తొలగించి ఆ స్థలాన్ని రోడ్డు కోసం ఇంజనీరింగ్ అధికారులకు అప్పగించాలి. కానీ జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు టీడీఆర్‌ను అందజేసినా భవనాన్ని తొలగించే ప్రయత్నం ... మిగతా 6వ పేజీలో

# డెంగ్యూ అలజడి



## నగరంలో పెరుగుతున్న కేసులు

వచ్చే మూడు నెలల్లో మరింత విజృంభించే అవకాశం

అగనంపూడిలో బాలుడి మృతి

- అప్రమత్తమైన జీవీఎంసీ ప్రజారోగ్యం విభాగం
- యాంటీ లార్వా ఆపరేషన్ ప్రారంభం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

**నగరంలో డెంగ్యూ అలజడి రేపుతోంది. అగనంపూడి ప్రాంతానికి చెందిన తొమ్మిదేళ్ల బాలుడు డెంగ్యూ లక్షణాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందడం నగరవాసులతోపాటు జీవీఎంసీ అధికారులను ఉలికిపాటుకు గురిచేసింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో డెంగ్యూ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.**

నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఏటా జూన్ నుంచి వర్షాలు ప్రారంభమవుతాయి. వర్షం కురిసినప్పుడు వీధుల్లో పారిశుధ్య నిర్వహణ పనులకు ఆటంకం కలుగుతుంది. దాంతో చెత్తకుప్పలు ఎక్కడికక్కడ పేరుకుపోవడం, డ్రైనేజీల్లో పూడికతీత సరిగ్గా జరగకపోవడంతో మురుగునీరు పొంగి రోడ్లపైకి చేరడం జరుగుతుంది. అలాగే వర్షం నీరు ఆరుబయట ప్రాంతాలు, చెత్తకుప్పల్లో ఉండే ప్లాస్టిక్ కవర్లు, మేడపైన ఉండే పూలకుండీల్లో చేరి నిల్వ ఉండిపోతుంది. ఇది డెంగ్యూ కారకాలైన 'ఈడిస్ ఈజిప్టియా' దోమల వ్యాప్తికి అనుకూలంగా మారుతోంది. అందుకే ఏటా జూన్ నుంచి డిసెంబరు వరకూ డెంగ్యూ కేసుల నమోదు ఎక్కువగా ఉంటుంది. డెంగ్యూ బారినపడినవారు సకాలంలో నిపుణుడైన వైద్యుడిని సంప్రతించి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ప్రాణాల మీదకు వచ్చే ప్రమాదం ఉంది.

**ఈ ఏడాది నమోదైన డెంగ్యూ కేసుల వివరాలు**

| నెల | కేసుల సంఖ్య |
|---|---|
| జనవరి | 37 |
| ఫిబ్రవరి | 39 |
| మార్చి | 38 |
| ఏప్రిల్ | 34 |
| మే | 31 |
| జూన్ | 32 |
| జూలై | 47 |
| ఆగస్టు (20 వరకూ) | 74 |

ఏటా నగరంలో జూన్ నుంచి డిసెంబరు వరకూ 1,500 నుంచి 2,000 వరకూ డెంగ్యూ కేసులు నమోదవుతుంటాయి. అయితే ఈ ఏడాది మాత్రం జనవరి నుంచే డెంగ్యూ కేసుల నమోదు మొదలైంది. కొద్దిరోజులుగా నగరంలో అడపాదడపా వర్షం కురుస్తుండడంతో వాతావరణం చల్లబడి దోమల వ్యాప్తికి అనుకూలంగా మారింది. దీనివల్ల ఈ ఏడాది ఇప్పటివరకూ 318 కేసులు నమోదైతే అందులో జూలై, ఆగస్టు 20 వరకూ నమోదైనవే 107. జూలై ముందువరకూ రోజుకు ఒకటి, రెండు నమోదైతే, ఇటీవల వీటి సంఖ్య భారీగా పెరిగినట్టు జీవీఎంసీ చెబుతున్నారు. నగర పరిధిలో భారీగా డెంగ్యూ కేసులు నమోదవుతున్నట్టు జీవీఎంసీ అధికారులకు జిల్లా మలేరియా విభాగం అధికారులు రోజువారీ నివేదికలు ఇస్తున్నారు. అయితే జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు మాత్రం డెంగ్యూ కేసులు నామమాత్రంగానే నమోదవుతున్నాయంటూ బుకాయిస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ ఏడాది జూలై 10న కొమ్మాది ప్రాంతానికి చెందిన 15 ఏళ్ల యువకుడికి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ కావడంతో కేజీహెచ్‌లో చేర్పించారు. బాధితుడిని జిల్లా మలేరియా అధికారిని స్వయంగా వెళ్లి పరామర్శించారు. అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు మాత్రం అధికారికంగా నిర్ధారణ కాలేదని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. తాజాగా అగనంపూడిలో తొమ్మిదేళ్ల బాలుడికి డెంగ్యూ సోకినట్టు అనకాపల్లి వైద్యులు ప్రాథమికంగా ... మిగతా 6వ పేజీలో

## రేపు జీవీఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

**విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):** ప్రజల సమస్యల పరిష్కారానికి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ఈ సోమవారం రద్దు చేస్తున్నట్టు కమిషనర్ పి.సంపత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం కృష్ణాష్టమి కావడంతో ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించిన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. నగరవాసులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



# పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం



ఇసుక డిపో వద్ద కలెక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ముకేశ్‌కుమార్ మీనా

- అవకతవకలకు పాల్పడితే చర్యలు
- రాష్ట్ర గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా

**అగనంపూడి (విశాఖపట్నం), ఆగస్టు 24:** ఉచిత ఇసుక విధానాన్ని అధికారులు పారదర్శకంగా అమలు చేయాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని రాష్ట్ర గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా హెచ్చరించారు. విశాఖ నగర పరిధిలోని అగనంపూడిలో గల ఇసుక డిపోను, పినమడక సచివాలయంలో ఏర్పాటుచేసిన ఇసుక బుకింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్‌తో కలిసి శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇసుక నిల్వలు, సరఫరా విధానం, బుకింగ్ ప్రక్రియ, ఇతర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. లోడింగ్, బుకింగ్ ప్రక్రియ వేర్వేరుగా నిర్వహిస్తున్నారా?, లేదా?...అని ఆరా తీశారు. బుకింగ్ కేంద్రంలోని రశీదు పుస్తకాలను, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఇసుకను ప్రజలకు సజావుగా అందించాలని సూచించారు. ఇసుక సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా వ్యవహరించాలని ముకేశ్‌కుమార్ మీనా ఆదేశించారు. ప్రస్తుతం డిపోలో ఉన్న ఇసుక నిల్వల గురించి కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆదేవిధంగా ఇసుక కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడి...ఇక్కడి పరిస్థితులు, అధికారులు, సిబ్బంది సహకారం గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మైన్స్ ఏడీ రాజు, తహసీల్దార్ శ్రీవల్లి, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన శిక్షణ కార్యక్రమం

**కంచరపాలెం, ఆగస్టు 24 :** కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభమైన ఏఐసీటీఈ ట్రైనింగ్&లెర్నింగ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. ఈ శిక్షణలో వివిధ కళాశాలల నుంచి అధ్యాపకులు, ఫ్యాకల్టీ పాల్గొని పరిశ్రమల్లో ఉత్పత్తుల్లో నాణ్యత నూతన అంశాలను నేర్చుకున్నారు. ముఖ్య అతిథులుగా సాంకేతిక విద్య ఏయూ రీజన్ ఆర్డీడీ, జె.సత్యనారాయణమూర్తి, ఏయూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొ.కె. రాంజీ, విశాఖ రిఫైనరీ డీజీఎం కె.ఇ.శ్రీధర్ తదితరలు హాజరై ప్రసంగించారు.ఆటోమేషన్ అన్నీ రంగాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఒ.రామ్మోహన్, ఎన్. చంద్రశేఖర్, డా.కె.వి.రమణ, కె.మధుకుమార్, అధ్యాపకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## నిరాశ్రయుడి అప్పగింత

**అక్కయ్యపాలెం, ఆగస్టు 24:** టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న దర్మాన కర్రె న్న (65)ను శనివారం తన అల్లుడు విశ్వనాథానికి అప్పగించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగఢ వాసు తెలిపారు. ఆయన ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దిక్కుతోచని స్థితిలో ఉండగా.. పోలీసుల సమాచారం మేరకు ఈ నెల 19వ తేదీన ఆయనను తీసుకువచ్చి వసతి గృహంలో ఆశ్రయం కల్పించినట్టు చెప్పారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి నిమ్మాడ గ్రామం నుంచి విశాఖకు వచ్చి భిక్షాటన చేస్తున్నారని పేర్కొన్నారు. మరోసారి విశాఖకు రావద్దని, వస్తే బెగ్గర్స్ హోంకి తరలించాల్సి ఉంటుందని మందలించి ఆయన అల్లుడు విశ్వనాథంకు అప్పగించామన్నారు.

## తులసీదళాలతో కనకమహాలక్ష్మికి పూజలు

**పూర్ణామార్కెట్, ఆగస్టు 24:** వన్‌టౌన్ కనకమహాలక్ష్మికి శనివారం ఉదయం తులసీదళాలతో అలంకరించి ప్రత్యేకంగా ఉభయదాతలతో పూజలు జరిపించారు. అలాగే, నిత్యపూజాధికాలతోపాటు శ్రావణమాసోత్సవ్‌లో భాగంగా కుంకుమపూజలు, హోమం నిర్వహించారు. ఈ వో శ్రీనివాసులు రెడ్డి, జేఈవో వి.రాంబాబు పాల్గొన్నారు. భక్తులతో ఆలయం కళకళలాడింది.

## 'వృద్ధుల సంరక్షణలో ఏజ్‌కేర్ కృషి ప్రశంసనీయం'

**అక్కయ్యపాలెం, ఆగస్టు 24:** వృద్ధుల సంక్షేమం కోసం ఏజ్‌కేర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవలు ప్రశంసనీయమైనవని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఏజ్‌కేర్ ఫౌండేషన్ సంస్థ 12వ వార్షికోత్సవం దొండపర్తిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన గంటా మాట్లాడారు. సౌత్ ఏసియా ఎల్‌పీజీ ఉపాధ్యక్షుడు మథీజా, రెయిన్ కార్బన్ సంస్థ ఉపాధ్యక్షుడు విక్రమ్ వర్మ, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ ప్రక్షాళనపై హర్షం

**అక్కయ్యపాలెం, ఆగస్టు 24:** తిరుపతి దేవస్థానంలో ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ రూ.300 నుంచి రూ.200కు రాష్ట్ర ప్రభుత్వం తగ్గించడంపై టీడీపీ జిల్లా మీడియా కో ఆర్డినేటర్ కె.గోపాల్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనం సామాన్యులకు గగనమైపోయిందన్నారు. జగన్ హయాంలో స్వామివారి దర్శనం, సేవలు ఆన్‌లైన్‌లో విడుదల చేసిన క్షణంలో మొత్తం అయిపోయినట్లు చూపించేవారన్నారు. కానీ, ప్రస్తుతం చంద్రబాబు పాలనలో టీటీడీ ప్రక్షాళన ప్రా రంభమైందన్నారు. నవంబరు నెల దర్శనాల వివరాలను శనివారం ఉదయం ఆన్‌లైన్ విడుదల చేస్తే సాయంత్రం వరకు ఖాళీలు చూపడం, టికెట్ ధర తగ్గించడం హర్షణీయమన్నారు. ఈవిధమైన పరిస్థితేఉండాలని గత ఐదేళ్లుగా భక్తులు కోరుకున్నారన్నారు.

## జిల్లాస్థాయి డ్యాన్స్ పోటీలు

**డాబాగార్డెన్స్, ఆగస్టు 24:** విశాఖ జిల్లాలోని పాఠశాలల విద్యార్థుల్లో సృజనాత్మకను ప్రోత్సహించడానికి ఇంటర్ స్కూల్స్ డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ డైరెక్టర్ ఉజ్జస్విప్ తెలిపారు. ఈ పోటీల్లో తొమ్మిది నుంచి 12 ఏళ్ల వారిని జూనియర్స్‌గా, 13 నుంచి 15 ఏళ్ల వారిని సీనియర్స్‌గా పరిగణిస్తామన్నారు. ప్రాథమిక స్థాయి పోటీలో పాల్గొనే విద్యార్థులు జానపద, శాస్త్రీయ, దేశభక్తి విభాగాల్లో నృత్యం మూడు నిమిషాల పాటు చిత్రీకరించి వాట్సాప్ నంబరు 72071 50372కు సెప్టెంబరు 10లోపు పంపించాల్సి ఉంటుందన్నారు. ఇందులో ఉత్తమ ప్రదర్శనను ఎంపిక చేసి సెప్టెంబరు 29న విశాఖలో జరిగే ఫైనల్స్ పోటీ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ముందుగా ఫోన్: 85229 90123ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

## జూనియర్ వైద్యురాలి హత్యాచారంపై నిరసన



అక్సిజన్ టవర్స్ వద్ద కొవ్వొతులతో నిరసన

**సీతమ్మధార, ఆగస్టు 24:** కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచారాన్ని ఖండిస్తూ సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్ లోని డాక్టర్స్.. రెసిడెంట్స్ కలిసి శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నల్ల దుస్తులు ధరించి వైద్యురాలి మృతికి సంతాపం తెలిపారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శివాజీ ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనూష, సైమిని, అన్నపూర్ణరావు, సురేఖ, ఉషారాణి, మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ భద్రత ఏర్పాట్లను పరిశీలించిన సీపీ


పోర్టుస్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

**సీతంపేట, ఆగస్టు 24:** నగరంలోని పోర్టు స్టేడియంలో ఈ నెల ఆగస్టు 26 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరుగనున్న నేపథ్యంలో నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. వచ్చే నెల సెప్టెంబరు 5 వరకూ 11 రోజులపాటు జరగనున్న ఈ ర్యాలీలో అభ్యర్థులకు ఎటువటి ఇబ్బందులకు గురికాకుండా ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించారు. రోజూ హాజరయ్యే అభ్యర్థుల సంఖ్య, అందుకు తగిన వసతుల సమీక్షించారు. తొక్కిసలాటకు తావు లేకుండా ఏర్పాటు చేసిన బ్యారికేడ్లు, ఇతర అవసరమైన వసతులను పరిశీలించారు. ఆర్మీ అధికారులతో ఇతర భద్రతా ఏర్పాట్లను చర్చించారు.

## నేత్రదానంపై అవగాహన కల్పించాలి


నేత్రదాన పక్షోత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

**సీతంపేట, ఆగస్టు 24:** నే త్ర దానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో పి. జగదీశ్వరరావు కోరారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాంతీయ నేత్రవైద్యశాలలో 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎంహెచ్‌వో, నేత్రవైద్య శాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్య క్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్స్ భాగస్వాములుగా నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. నేత్రదానంపై అపోహలను తొలగించాలని సూచించారు. 15 రోజులపాటు నేత్రదానంపై కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీలక్ష్మి, జూనియర్ వైద్యులు, సిబ్బంది, ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ మేనేజర్ అభినిత్ .జైన్, సిబ్బంది, పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్స్ ఉమా శ్రీనివాస్, ఆర్ సురేష్, ఐ డోనేషన్ కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం


వేదికపై ఎంపీ సియం రమేష్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, సోము వీర్రాజు

**మురళీనగర్, ఆగస్టు 24 ;** మురళీనగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి ఎంపీ సియం.రమేశ్, ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పార్టీ వ్యవస్థాపకుల ఫొటోలకు నివాళి అర్పించారు. అనంతరం సభ్యత్వ నమోదులో వచ్చిన టెక్నాలజీ మార్పులను వివరించారు. కార్యకర్తలు పార్టీ సభ్యత్వ నమోదులో చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. సందేహాలకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పార్టీ ప్రధాన ఉద్దేశాలు, వికసిత్ భారత్ లక్ష్యాలను కార్యకర్తలకు వివరించారు. పలు ప్రాంతాల నాయకులు, విశాఖ జిల్లా ప్రతినిధులు కార్యక్రమంలో ఉన్నారు.

## ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్‌గా అచ్యుతరావు ఎన్నిక



సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావును సన్మానిస్తున్న కళాకారులు, ఉద్యోగులు

**డాబాగార్డెన్స్, ఆగస్టు 24:** ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్‌గా డా.కంచర్ల అచ్యుతరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి చవల మురళీకృష్ణ శనివారం తెలిపారు. సినీ నిర్మాతగా, విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘానికి అధ్యక్షుడిగా కంచర్ల సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల సినీ పరిశ్రమలో 24 క్రాఫ్ట్‌లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఏ ప్రాంతంలో షూటింగ్స్ జరిగితే ఆ ప్రాంత కార్మికులకే అవకాశం కల్పించి వారి జీవనోపాధికి సాయపడతానన్నారు. ఫెడరేషన్ అధ్యక్షుడు తోరంరాజా, ఉపాధ్యక్షుడు కొండపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## నాట్యకళలను ప్రోత్సహించాలి

**సీతంపేట, ఆగస్టు 24:** సంప్రదాయ కళలో భాగమైన నాట్యకళలను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ పేర్కొన్నారు. శంకరమఠం ఎదురుగా ఉన్న పద్మశాలి భవన్‌లో నటరాజ నృత్యనికేతన్ వ్యవస్థాపకుడు, నాట్య గురువు జి.పరమేశ్వరన్ సారథ్యంలో శనివారం నాట్యగజ్జల స్వీకరణ పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజశేఖర్ పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ఔన్నత్యాన్ని నాట్య కళలు చాటుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారిణి సుశీల నాగరాజు, భక్తమార్కేండేయ ట్రస్ట్ ప్రతినిధులు కె.సన్యాసిరావు, టివెంకటేశ్వర్లు, వి.కృష్ణ మోహన్, బి.పి.ఎస్. కళ్యాణి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సింహాచలం రైల్వే స్టేషన్‌లో రూ.12.69 కోట్లతో పాదచారుల వంతెన

**విశాఖపట్నం, ఆగస్టు 24:** సింహాచలం రైల్వే స్టేషన్‌లో పొడవైన పాదచారుల వంతెన పునర్నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. చంద్రనగర్, సింహాచలం రైల్వే స్టేషన్ మధ్య ప్రజల రాకపోకల కనెక్టివిటీ సౌకర్యార్థం పాత పాదచారుల వంతెన స్థానంలో కొత్తది నిర్మించేందుకు ఆమోదం లభించింది. దశాబ్దాల నాటి పాత ఫుట్ ఓవర్ బ్రిడ్జితో స్థానిక నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యను వాల్తేరు డివిజన్ డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్ గుర్తించి జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఇటీవల ఈ స్టేషన్‌లో జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ పరిశీలించిన మీదుట కొత్త వంతెన నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా ఏడు ట్రాక్‌లను దాటేందుకు అనువుగా 115మీ. పొడవు, మూడు మీటర్లవెడల్పుతో కొత్త పాతచారుల వంతెనకు రూ.12.69 కోట్ల నిధులను మంజూరు చేశారు. కాగా అమృత్ స్టేషన్ పథకంలో భాగంగా సింహాచలం స్టేషన్ కొత్త భవనంతోపాటు మరో ప్రవేశ ద్వారం, అదనపు పార్కింగ్ సౌకర్యం తదితరాలు అందుబాటులోకి రానున్నాయి.

## ఎయిడ్స్‌పై అవగాహనకు 5కే మారథాన్


విజేతలతో అతిథులు, నిర్వాహకులు

**సీతమ్మధార, ఆగస్టు 24:** ఎయిడ్స్ నియంత్ర సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై యువతలో అవగాహన పెంపొందించేందుకు యూత్ ఫెస్ట్ 5కే రెడ్ రన్ మారథాన్‌ను బీచ్ రోడ్డులో శనివారం కాళీమాత ఆలయం వద్ద ప్రారంభించారు. వివిధ కళాశాల నుంచి 150 మంది విద్యార్థులు, జిల్లా క్రీడా శాఖ, నెహ్రూ యువ కేంద్ర, ఉన్నత విద్య శాఖ, కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్బు, కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల అధికారుల సహకారంతో ఈ కార్య క్రమం చేపట్టారు. తొలుత ఈ మారథాన్‌ను జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ నివారణ అధికారి సీహెచ్ పూర్ణేంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీ రహిత జిల్లాగా మార్చడంతో ప్రముఖ పాత్ర వహించాలన్నారు. రన్‌లో విజేతలుగానిలిచిన వారికి సర్టిఫికేట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలోఉమామహేశ్వరరావు, డీఐఎస్ భద్రి, స్పోర్ట్ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

## జడ్పీ సీఈవోకు ఘనంగా వీడ్కోలు


సీఈవో దంపతులను సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

**మహారాణిపేట, ఆగస్టు 24:** జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ విధులు నిర్వహించిన ఎం.పోలినాయుడు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఓఎస్‌డీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఉద్యోగులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపిల్లి సుభద్ర అధ్వ ర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఈవో జి. సత్యనారాయణ, కె. శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


విశ్వతేజ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

**అక్కయ్యపాలెం, ఆగస్టు 24 :** తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ పాఠశాలలో శ్రీకృష్ణష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు విద్యార్థులు కృష్ణాష్టమి వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.భాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఐ.సునీత తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుడి చట్టంతో ఎంతో మేలు

**డాబాగార్డెన్స్, ఆగస్టు 24:** వినియోగదారుల చట్టంతో అన్ని వర్గాలు న్యాయం పొందవచ్చుని సుప్రీంకోర్టు న్యాయవాది, అడ్వకేట్స్ అసోసియేషన్ అవేర్నెస్ (ఆశ్రా) వ్యవస్థాపకుడు హబీబ్ సుల్తాన్ ఆలీ తెలిపారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైద్యుల నిర్లక్ష్యంపై ఒక వినియోగదారుడు కేసు వేసి నష్టపరిహారంగా రూ.21.60 లక్షలు పొందినట్టు చెప్పారు. ఆశ్ర సంస్థ దేశంలోనే అతిపెద్ద వినియోగదారుల సంస్థ అన్నారు. 2500 అవగాహన శిబిరాలు , బీమా కేసులు, సేవాలోపం అంశాలపై 275 కేసులు వేశామన్నారు. ఈ సమావేశంలో ఆశ్ర రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది తోట శత్రుఘ్నుడు, సభ్యులు మహ్మద్‌ఇక్బాల్ జి.కిషోర్‌కుమార్, ఎండీ నజీమ్, జి. శ్యామలాదేవి, పి. హైమ పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలపై దృష్టి మరలకుండా చూడాలి


మాట్లాడుతున్న బాలల కమిషన్ సభ్యుడు సీతారామ్

**సీతమ్మధార, ఆగస్టు 24:** పిల్లలు మాదకద్రవ్యాలు వైపు మరలకుండా స్కూల్ యాజమాన్యాలు సహరించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారామ్ కోరారు. సీతమ్మధారలోని ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు, వార్డు సచివాలయాల కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో లైంగిక దాడులపై చిన్నారులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ సైకాలజీ విభాగం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, పిల్లల మనస్తత్వ నిపుణులు ఎం.సాయి వంశీ, పార్వతి కాశ్యప్, ఐసీడీపీ పీవో వెంకటేశ్వరి, అసిస్టెంట్ లెబర్ ఆఫీసర్ ఎం.విజయ, డీసీపీయూ ప్రతినిధులు కె.శారద, కె.శకుంతల, ఆనంద్, ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్స్ కె.మనోజ్, కె.విజయకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈపీడీసీఎల్ సీవీఓగా రామకృష్ణప్రసాద్


సీఎండీ పృథ్వీతేజ్‌ను కలిసిన సీవీఓ రామకృష్ణ ప్రసాద్

**విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):** తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా నియమితులైన కె.రామకృష్ణప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ పృథ్వీతేజ్‌ను కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ, సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి సర్కిళ్ల వినియోగదారులు దీర్ఘకాలకంగా పరిష్కారం కాని విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, విద్యుత్ చౌర్యానికి సంబంధించిన ఫిర్యాదులు టోల్ ఫ్రీ నంబరు 1912కి తెలియజేయాలని కోరారు.

## ప్రత్యేకావసరాల గల పిల్లలకు డిజిటల్ విద్య: డీఈవో

**కంచరపాలెం, ఆగస్టు 24 :** ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు డిజిటల్ విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపున్నట్టు డీఈవో ఎల్.చంద్రకళ పేర్కొన్నారు. ఆర్కే బీచ్ సమీపంలో యూత్ హాస్టల్‌లో శనివారం సహిత విద్య రీసోర్సు పర్సన్స్‌కు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడారు. దివ్యాంగ విద్యా ర్థుల్లో అభ్యాసన ఫలితాలను రాబట్టేందుకు సమగ్ర శిక్ష ద్వారా ట్యాబుల పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఈ ట్యాబులు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష రాష్ట్ర విభాగం కన్సల్టెంట్ డాక్టర్ నరశింహం, సహాయక సమన్వయకర్త డా.ఎస్. అమ్మినాయుడు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గీత, డి. అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మా ప్రమాదాలపై అఖిలపక్షం

... 5వ పేజీ తరువాయి

లోపాలు ఉన్నట్టయితే లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫార్మా కంపెనీలలో నెలకొన్న పరిస్థితులపై చర్చ జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, వి.విమల ఎస్‌కే రహమాన్ పి.చంద్రశేఖర్, మన్మథరావు క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

తప్పనిసరిగా ఏడాదికి ఒకసారి సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి. వీటిని తనిఖీ చేసే సాంకేతిక పరిజ్ఞానం ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులకు ఉండదు కాబట్టి థర్డ్ పార్టీ ఏజెన్సీలతో ఆడిట్ నిర్వహించి నివేదిక సమర్పించాలి. విశాఖపట్నం జిల్లాలో 57 పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో కేవలం పది మాత్రమే ఈ సేఫ్టీ ఆడిట్ ప్రతి ఏడాది నిర్వహిస్తున్నాయి. హెచ్‌పీసీఎల్, కోరమండల్, స్టీల్‌ప్లాంటు, ఐటీసీ ఇలా భారీ పరిశ్రమలు ఆ జాబితాలో ఉన్నాయి. మిగిలిన 47 పరిశ్రమలు థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్ చేయాల్సిన అవసరం లేదు. చట్టంలో ఈ లొసుగు ఉండడంతో ప్రైవేటు పరిశ్రమలు సేఫ్టీ ఆడిట్‌ను గాలికి వదిలేస్తున్నాయి. కొన్ని ఆడిట్ చేయించినా, నిపుణులు చేసిన సూచనలు పాటించడం లేదు. ఎసెన్షియా అదేవిధంగా వ్యవహరించడం వల్ల భారీ ప్రమాదం జరిగింది.

### జాయింట్ సేఫ్టీ ఆడిట్ తప్పనిసరి

పరిశ్రమ అయినా, వ్యాపార సముదాయమైనా, ప్రభుత్వ సంస్థ అయినా భద్రత చాలా ముఖ్యం. ప్రభుత్వం ఆదేశించకపోయినా తప్పనిసరిగా భద్రత ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయా? లేదా?...అని చూసుకోవాలి. షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్లు, భారీ వాణిజ్య సముదాయాలు, పరిశ్రమల్లో అప్పుడప్పుడు మాక్ డ్రిల్ నిర్వహించి, ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్ పనితీరు, ప్రమాదం జరిగితే తప్పించుకునే విధానం వంటివి సిబ్బందికి తెలియజేయాలి. ప్రతి పరిశ్రమలో అన్ని శాఖల అధికారులు కలిసి జాయింట్ సేఫ్టీ ఆడిట్ చేయవచ్చు. దీనికి జిల్లా అధికారి నేతృత్వంలో కమిటీని వేసి, అమలు చేయాలి. ఈ విధానం సరిగ్గా అమలు కావడం లేదు. సమీక్షలు ఉండడం లేదు. ఎసెన్షియా ప్రమాదం తరువాత ప్రభుత్వం వీటిపై దృష్టిసారించింది.

### ఎవరికి వారే..?

జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని ప్రమాదాలు జరిగాయి? ఎంత మంది చనిపోయారు? అని అమరావతి నుంచి వచ్చిన ఉన్నతాధికారి ప్రశ్నించినప్పుడు అన్ని శాఖల అధికారులు తెల్లముఖాలు వేశారు. పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్లు...ఇలా ఎవరికి వారు తమ దగ్గర డేటా లేదంటే...తమ దగ్గర లేదని సమాధానం ఇచ్చారు. ఇకపై జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఈ సమాచార సేకరణ, నిర్వహణ జరగాలని సూచించారు.

### సమాచారం ఇవ్వకుండానే చికిత్సలు

ఎసెన్షియాలో ప్రమాదం జరిగిన రెండో రోజే పరవాడలోని రాంకీ ఫార్మాసిటీలోని సినర్జీస్ కంపెనీలో రియాక్టర్ వద్ద ప్రమాదం జరిగింది. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం అధికారులకు తెలియజేయకుండానే బాధితులను ఆస్పత్రికి తరలించారు. కొన్ని గంటల తరువాత ఈ విషయం ప్రజా ప్రతినిధుల దృష్టికి రావడంతో అధికారులను ప్రశ్నించారు. వారు మళ్లీ తెల్లముఖం వేశారు. పరిశ్రమలు, ప్రభుత్వానికి మధ్య కమ్యూనికేషన్ లేదని, బాధ్యతగా వ్యవహరించడం లేదని గుర్తించి హెచ్చరికలు చేశారు. ఏ ఆస్పత్రి అయినా సరే ఇలాంటి కేసులు వచ్చినపుడు చికిత్స ప్రారంభిస్తూనే జిల్లా యంత్రాంగానికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

## వారంలోగా భద్రతా ఆడిట్

... 5వ పేజీ తరువాయి

ప్రతిస్పందన, స్వీయరక్షణపై కార్మికులు, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలన్నారు. కాలం చెల్లిన యంత్రాలను మార్చాలని, భద్రతాపరమైన యంత్రాంగాన్ని రూపొందించుకోవాలన్నారు. సమీపంలోని ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా ప్రశాంత వాతావరణంలో పరిశ్రమలను నిర్వహించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, జాయింట్ సీపీ ఫకీరప్ప, డిప్యూటీ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం గణపతి, కాలుష్య నియంత్రణమండలి ఈఈ ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కర్మాగారంలో 17 మంది మృతిపై సమావేశం విచారం వ్యక్తంచేస్తూ వారి మృతికి సంతాపం ప్రకటించి రెండు నిమిషాలు మౌనం పాటించింది.

## డెంగ్యూ అలజడి

... 5వ పేజీ తరువాయి

నిర్ధారించి, కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. కేజీహెచ్‌లో బాలుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. బాలుడు మృతికి డెంగ్యూ సోకడమే కారణమని అనకాపల్లిలోని వైద్యులుచెప్పారని బాలుడు కుటుంబసభ్యులు చెబుతుంటే... జీవీఎంసీ అధికారులు మాత్రం కేవలం డెంగ్యూ లక్షణాలు మాత్రమేనని, ఇంకా అధికారికంగా నిర్ధారణ కాలేదంటూ చెబుతున్నారు.

### జీవీఎంసీ అధికారులు అప్రమత్తం

డెంగ్యూ కేసులు తీవ్రస్థాయిలో నమోదయ్యే అవకాశం ఉందనే సంకేతాల నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. దోమల నియంత్రణ కోసం యాంటీ లార్వా ఆపరేషన్ ప్రారంభించారు. సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లోని ఇంటింటికీ వెళ్లి దోమల లార్వాలను గుర్తించి నిర్వీర్యం చేసే పనికి శ్రీకారం చుట్టారని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ వివరించారు. డెంగ్యూ తీవ్రత గత ఏడాదితో పోల్చితే తక్కువగానే ఉందని, ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

## వైసీపీ నేత బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

చేయలేదు. భవన యజమాని వైసీపీ నేత కావడం వల్లే టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ భవనంలో దుకాణాలకు మంచి డిమాండ్ ఉండడం, భారీగా అద్దెలు వస్తుండడంతో అదనంగా మరో అంతస్తు నిర్మించేందుకు యజమాని సిద్ధమయ్యారు. ఈ ఏడాది జనవరిలో పనులు ప్రారంభించారు. దీనిపై స్థానికులు కొంతమంది జోన్-2 టౌన్‌ప్లానింగ్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు పత్రికల్లో వార్తలు రావడంతో అధికారులు తప్పనిసరి పరిస్థితిలో భవనం వద్దకు వెళ్లారు. నిర్మాణ పనులను కొంతకాలం ఆపాలని యజమానిని వేడుకున్నారు. అధికారం అండగా ఉందనే ధీమాతో యజమాని వారిపై తిరగడడమే కాకుండా దూషణకు దిగారు. దీనిపై సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేసినా అధికార పార్టీ నేత కావడంతో పోలీసులు సైతం కేసు లేకుండా నచ్చజెప్పి పంపించేశారు. తర్వాత వైసీపీ అధికారం కోల్పోవడంతో నిర్మాణ పనులను సదరు భవన యజమాని నిలిపివేశారు. ఏమైందోగానీ మళ్లీ భవన నిర్మాణ పనులు చేపడుతుండడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ విషయం జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా...నిర్మాణాలను నిలిపివేయించి, టీడీఆర్ జారీచేసిన మేరకు స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తోంది. జీవీఎంసీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పి.సంపత్‌కుమార్ అయినా దీనిపై దృష్టిసారించి, అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బీవీకే రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

## స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ నూతన విభాగాధిపతికి సత్కారం

**ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 24:** స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ నూతన విభాగాధిపతిగా బాధ్యతలు చేపట్టిన బీవీకే రెడ్డిని విభాగానికి చెందిన ఇంటక్ నాయకులు శనివారం కలిసి అభినందనలు తెలిపారు. ప్లాంట్‌లోని కీలక విభాగానికి హెచ్‌వోడీగా రావటం ఆనందనీయమని, కర్మాగారాన్ని మరింత ప్రగతి పథంలోకి తీసుకువెళ్లాలని వారు ఆకాంక్షించారు. ఉక్కు కర్మాగారంలోని మూడు ఫర్నేస్‌లలో ఉత్పత్తి సాధించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోలీస్ నాయుడు, పీవీ నగేశ్, అప్పలరెడ్డి, సత్యారావు, గోవిందరాజులు, రవికుమార్ పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

**అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 24:** షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రావణ మాసం మూడో శనివారాన్ని పురస్కరించుకుని శనివారం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామున ప్రధానార్చకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు శ్రీవారిని పంచామృతాలతో అభిషేకించి, వివిధ రకాల పుష్పాలతో తోమాల సేవ చేశారు. సాయంత్రం ప్రత్యేక వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను ఆశీనులను చేసి సహస్ర నామార్చన, నక్షత్ర హారతి, శాంతి కల్యాణాన్ని వైభవంగా జరిపారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### 65వ వార్డులో..

**పెదగంట్యాడ:** గ్రేటర్ 65వ వార్డు పరిధి వెంకటాద్రిపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున సుప్రభాత సేవ అనంతరం శ్రీవారికి మంగళస్నానాలు, నూతన వస్త్రాలంకరణ జరిపాక పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల, కమిటీ సభ్యులు జి.రామలక్ష్మి, పి.కోటరాజు, కుసుమకుమారి, వెంకటలక్ష్మి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకునికి ప్రశంసాపత్రం



గండి బాబ్జీ చేతుల మీదగా ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

**అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 24:** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను టీడీపీ యాప్ ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లి, సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేసినందుకు గాను ఉత్తమ సర్వీస్ అవార్డుకు అక్కిరెడ్డిపాలేనికి చెందిన టీడీపీ జిల్లా కార్యదర్శి పసుపులేటి శ్రీనివాస్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పంపిన ప్రశంసాపత్రాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ చేతుల మీదగా శ్రీనివాస్ అందుకున్నారు.

## సినిమా గైడ్

- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** సంగం, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), విశేష్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్లు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **డిమోంటీ కోలనీ-2 :** మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **తంగలాన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), తాతా (తగరపువలస)
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, శ్రీకన్య (గాజువాక)
- **ఆర్.కె.పురంలో :** శ్రీకాంతి

## రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 47, టమాటా 27, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 22, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 26, క్యారెట్ 32, దొండకాయలు 26, బంగాళదుంపలు 32, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 120, మునక్కాడలు (కిలో) 40, బరబాటి 24, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 30, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 40, కీరదోస 30, క్యాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడుచిక్కుడు 72, కొండ ఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

### కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 505 |
| విజయనగరం | 509 |
| శ్రీకాకుళం | 509 |

### చికెన్ ధరలు

బ్యాగ్

| | | |
|---|---|---|
| రైతు ధర | -- | 95 |
| ఫారం ధర | -- | 115 |
| విత్ స్కిన్ | -- | 200 |
| స్కిన్‌లెస్ | -- | 210 |

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

# 14న గాజువాకలో జాతీయ లోక్ అదాలత్

జిల్లా 13వ అదనపు జడ్జి జి.షణ్ముఖరావు

**గాజువాక, ఆగస్టు 24:** సుప్రీంకోర్టు, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సెప్టెంబరు 14వ తేదీన గాజువాక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా 13వ అదనపు జడ్జి జి.షణ్ముఖరావు పేర్కొన్నారు. గాజువాక కోర్టు ప్రాంగణంలో పోలీస్ అధికారులు, న్యాయమూర్తులు, న్యాయవాదులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ తగాదాలు, రెవెన్యూ,



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి షణ్ముఖరావు

బ్యాంకులు, కుటుంబ తగాదాలు, కార్మిక, మోటారు ప్రమాద పరిహార ట్రిబ్యునల్, ఇన్సూరెన్స్, విద్యుత్, నీరు, టెలిఫోన్, యుటిలిటీ గొడవలు, రాజీపడదగ్గ అన్ని క్రిమినల్ కేసులు, ట్రాఫిక్, మునిసిపల్ వివాదాలు వంటి వాటిపి పరిష్కరించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో కార్యక్రమంలో జడ్జిలు రాజేంద్రబాబు, ప్రదీప, వై.శ్రీలక్ష్మి, పల్లవి, పలువురు పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ లబ్ధి కోసమే జగన్ అనుచిత వ్యాఖ్యలు

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

**గోపాలపట్నం, ఆగస్టు 24:** అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాద ఘటనపై రాజకీయ లబ్ధి కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనుచిత రీతిలో వ్యాఖ్యలు చేయడం విచారకరమని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు విమర్శించారు. గోపాలపట్నంలోని తమ నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గణబాబు మాట్లాడుతూ గత ఐదేళ్లలో పరదాల మాటున తిరిగిన జగన్ ఎన్నికల్లో ఓడిపోయాక ప్రెస్‌మీట్‌లు పెట్టడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఫార్మా బాధితులను పరామర్శించడానికి వచ్చిన జగన్ కూటమి ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఫార్మా కంపెనీ బాధితులను అన్నివిధాలా ఆదుకోవడంతోపాటు భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించినట్టు గణబాబు పేర్కొన్నారు. నిజాలు తెలియకుండా జగన్ బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వెంకటాపురంలో ఎల్జీ పాలిమర్స్ దుర్ఘటన జరిగితే... తమను ఆదుకోవాలని కోరుతూ నిరసన దిగిన బాధితులపైన క్రిమినల్ కేసులు పెట్టి, వారిని ఇబ్బందులకు గురి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గణబాబు

చేశారని గుర్తు చేశారు. ఈ ఘటన తర్వాత తలెత్తే సమస్యలపై హై లెవెల్ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం విష వాయువు ప్రభావంతో కంపెనీకి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రజలకు తలెత్తే ఆరోగ్య సమస్యలపై వైద్యం అందించేందుకు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం చేపడతామని అప్పటి మంత్రులు ప్రకటించినా, అది కార్యరూపం దాల్చలేదని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించాలని చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని గణబాబు పేర్కొన్నారు.

# వేతనాల తగ్గింపు సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలి

స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) శ్రీధర్‌ను కోరిన అధికారుల సంఘం ప్రతినిధులు

**ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 24:** స్టీల్‌ప్లాంట్ అధికారుల వేతనాల నుంచి ఆరు శాతం తగ్గిస్తూ ఉక్కు యాజమాన్యం ఈ నెల 20న జారీ చేసిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) యు.శ్రీధర్‌తో 'సీ' ప్రతినిధులు సమావేశమయ్యారు. ఇప్పటికే 2007 వేతన ఒప్పందం తరువాత అధికారులకు పెద్ద మొత్తంలో పెన్షన్ ఫండ్ బకాయిలు, 2011లో పీఆర్‌సీ చెల్లింపు సమయంలో



ఉక్కు సీజీఎం శ్రీధర్‌తో మాట్లాడుతున్న 'సీ' ప్రతినిధులు

అన్యాయంగా కోత విధించిన ఇన్సెంటివ్ బకాయిలు, 2017 నుంచి చేయాల్సిన వేతన బకాయిలు, ఐదేళ్లగా పదోన్నతులు లేకపోవడంతో కోల్పోయిన వేతనం, చట్టబద్ధమైన చెల్లింపులు, అధిక మొత్తంలో విద్యుత్ చార్జీల చెల్లింపులు వంటివెన్నో అధికారులు కోల్పోయారని, ఇలాంటి తరుణంలో పెర్క్స్‌లో తగ్గింపు విధించడం భావ్యం కాదని వారు పేర్కొన్నారు. అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలని, వారిని ఇబ్బందులకు గురి చేయవద్దని విజ్ఞప్తి చేశారు. దీనిపై సీజీఎం స్పందించి.. ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చినట్టు 'సీ' ప్రతినిధులు పేర్కొన్నాను. సమావేశంలో 'సీ' అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్, ఉపాధ్యక్షుడు చంద్ర వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ప్రారంభమైన కృష్ణాష్టమి వేడుకలు



శ్రీనగర్‌లో పూజలందుకున్న కృష్ణుడు

**శ్రీనగర్, ఆగస్టు 24:** జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లోని శ్రీకృష్ణ, గణపతి, రమా సహిత సత్యనారాయణస్వామి వారి ఆలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆలయానికి రంగులు వేయించి, విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రధాన అర్చకులు భూషణశర్మ పంచామృతాలతో అభిషేకాలు, పూజలు చేశారు. ఈ నెల 28 వరకు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవాల సూర్యనారాయణ, కె.సహదేవరావు, లక్ష్మణరాజు, శ్రీనివాసరాజు, పంచముఖేశ్వరరావు, బి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### శారదా పీఠంలో రేపు..

పెందుర్తి: చినముషిడివాడలోని శారదాపీఠంలో కృష్ణాష్టమి వేడుకలనె సోమవారం నిర్వహించేందుకు పీఠం శ్రీకార్యం ఏర్పాట్లు చేస్తోంది. రుషికేశ్‌లో చాతుర్మాస్య దీక్షలో ఉన్న పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆదేశాల మేరకు పీఠం ప్రాంగణంలోని కృష్ణభగవానుడికి అభిషేకంతో పూజాది కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. గోపూజ తర్వాత కాకూరి వెంకట సూర్యనారాయణమూర్తి భగవద్గీత గానామృతం ఉంటుంది. సాయంత్రం కోలాటం, ఉట్టు కొట్టు ఉత్సవం, గోపిక, శ్రీకృష్ణ వేషధారణతో చిన్నారుల ప్రదర్శనలను నిర్వహిస్తారు. ఆసక్తి గల చిన్నారులు 94403 93333 సెల్ నంబర్‌ను సంప్రదించవచ్చు. అలాగే పురుషోత్తపురంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించనున్నారు.

### గోపీజనవల్లభస్వామి ఆలయంలో..

**వేపగుంట:** భరత్‌నగర్ దరి శ్రీలక్ష్మీనరసింహనగర్‌లోని గోపీజనవల్లభస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామివారి శోభాయాత్ర, 26వ తేదీ ఉదయం స్వామివారికి క్షీరాభిషేకం, సహస్ర పుష్పార్చన, విష్ణుసహస్రనామ పారాయణం, మధ్యాహ్నం అన్న సమారాధన చేపడతారు. సాయంత్రం స్వామి వారికి 108 రకాల పదార్థాలతో నివేదన, ఊంజల సేవ, చిన్నికృష్ణుల నృత్య పోటీలు జరుగుతాయి.

# అప్రకటిత విద్యుత్ కోతలు: ప్రజలకు తప్పని తిప్పలు

**పెదగంట్యాడ, ఆగస్టు 24:** ఏపీఈపీడీసీఎల్ పెదగంట్యాడ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అప్రకటితంగా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి గాలులు వీచినా, వర్షాలు కురిసినా విద్యుత్ సరఫరా నిలిచిపోవడం సర్వసాధారణంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనులు చేపట్టినప్పుడు, వైర్లను మార్చినప్పుడు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేసినప్పుడుముందస్తుగా సంబంధిత అధికారులు ప్రకటించడం వల్ల వినియోగదారులు ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కానీ అలాంటి పనులేవీ చేపట్టనప్పుడు కూడా మధ్యాహ్నం, రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుండడం వల్ల అసౌకర్యానికి గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

గత నెల రోజులుగా రోజుకు ఒకటి, రెండుసార్లు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. 65వ వార్డు పరిధిలోని కొత్త దిబ్బపాలెం, అశోక్‌నగర్, ప్రియదర్శనీ కాలనీ, వాంబే కాలనీ ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. అందువల్ల అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా ఉన్నతాధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సుజాతనగర్‌లో ఎమ్మెల్యే పంచకర్ల గృహప్రవేశం



గృహప్రవేశం చేస్తున్న పంచకర్ల దంపతులు

**పెందుర్తి, ఆగస్టు 24:** ఎన్నికల సమయంలో తాను గెలిస్తే నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానన్న హామీ మేరకు నియోజకవర్గ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పెందుర్తిలో ఇల్లు తీసుకున్నారు. సుజాతనగర్ సమీపంలోని గోపాలకృష్ణనగర్‌లో శనివారం రమేశ్‌బాబు, మహాలక్ష్మి దంపతులు వేదాశీర్వచనాల నడుమ గృహ ప్రవేశం చేశారు. ఇప్పటివరకు నగరంలోని సీతమ్మధారలో ఉంటున్న ఆయన ఇకపై పెందుర్తిలోనే ఉంటూ అధికారిక కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు. అలాగే ఈ నెల 29న సుజాతనగర్‌లోని 80 అడుగుల రోడ్డులో క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. వారినికొక రోజు గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పంచకర్ల నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని జనసేన పార్టీ వర్గాలు తెలిపాయి.



రోగులు చికిత్స పొందుతున్న వార్డులో, ఆస్పత్రి హాల్‌లో ఊడిపోయిన సీలింగ్

# ఈఎస్ఐ ఆస్పత్రిలో ఊడి పడుతున్న స్లాబ్ సీలింగ్

ఇబ్బందులకు గురవుతున్న రోగులు, సిబ్బంది

**మల్కాపురం, ఆగస్టు 24:** కార్మిక బీమా ఆస్పత్రి (ఈఎస్ఐ)లో స్లాబ్‌కు ఉన్న సీలింగ్ ఊడి పడుతోంది. రోగులు చికిత్స పొందుతున్న వార్డుతో పాటు సిబ్బంది నిత్యం తిరిగే హాల్‌లో ఉన్న సీలింగ్ పెచ్చులుగా రాలిపోతోంది. దీంతో రోగులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఇటీవలే స్లాబ్‌కు కొత్తగా సీలింగ్ వేశారని, ఇంతలోనే పెచ్చులుగా పడిపోతుండడం శోచనీయమని పలువురు పేర్కొంటున్నారు.

## 'విజ్ఞాన్'లో పారిశ్రామికవేత్తల దినోత్సవం

**అగనంపూడి, ఆగస్టు 24:** దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్నోవేషన్, స్టార్టప్స్, పారిశ్రామిక అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఫ్యూట్ గ్లోబల్ సీఈవో శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థి దశలోనే పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా తమ లక్ష్యాలను నిర్దేశించు కుని, అందుకనుగుణంగా రాణించాలని సూచించారు. పారిశ్రామిక రంగంలో వస్తున్న మార్పుల గూర్చి వివరించారు. అనంతరం విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా ప్రహరీ పునర్నిర్మాణ పనులు



**మల్కాపురం, ఆగస్టు 24:** మల్కాపురం మెయిన్‌రోడ్డుకు ఆనుకుని కూలడానికి సిద్ధంగా ఉన్న హెచ్‌పీసీఎల్ ప్రహరీ పునర్నిర్మాణ పనులను యాజమాన్యం చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రహరీ ఎంతవరకు దెబ్బతిందో అంతవరకు కూల్చేసి, దాని స్థానంలో కొత్తగా నిర్మాణ పనులు ప్రారంభించంది. వాస్తవానికి ఇటీవలే ఈ ప్రహరీని నిర్మించగా, దిగువ భాగం దెబ్బతినడం గమనార్హం.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్

## స్థానిక యువతకు ఉపాధి కల్పనకు కృషి

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

**ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 24:** స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఎన్టీపీసీ, హిందూజా సంస్థల అధికారులు, స్థానిక నాయకులతో కలిసి శనివారం హిందూజా సంస్థలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పవర్ ప్లాంట్‌ల నుంచి వచ్చే యాష్ పౌండ్, దుమ్ము, ధూళి వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హిందూజా సంస్థకు రైల్వే లైన్ వేస్తే కాలుష్య సమస్యను చాలా వరకు నివారించవచ్చన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా కంపెనీల యాజమాన్యాలు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కంపెనీల్లో ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలను పాటించాలని సీఎం రమేశ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయా కంపెనీల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కు పరిరక్షణకు పోరాటాలే శరణ్యం

పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

**కూర్మన్నపాలెం, ఆగస్టు 24:** స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సమష్టి పోరాటాలే శరణ్యమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,290వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో అయినా విలీనం చేయాలని, లేకుంటే ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరూ పోరాటాలు సాగించి ఆంధ్రుల హక్కు అయిన ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఉక్కు ఉద్యోగుల పోరాటంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో పాటు అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని 'పల్లా'కు వినతి

**అగనంపూడి, ఆగస్టు 24:** అగనంపూడిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు స్థానిక నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా లోవోల్టేజీ సమస్య లేకుండా స్థానికంగా సబ్ స్టేషన్‌ను, అగనంపూడి నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో వీధి లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే స్థానికంగా అనకాపల్లి జిల్లా పరిధిలో ఉన్న పాఠశాలలను గాజువాక మండలంలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. పల్లాను కలిసిన వారిలో టీడీపీ నాయకులు బి.సత్యనారాయణ, ఈగల నరసింగరావు, చందూ రమేశ్, తదితరులు ఉన్నారు.

## ముగిసిన శిక్షణ కార్యక్రమం

**కంచరపాలెం,ఆగస్టు 24 :** కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభమైన ఏఐసీటీఈ ట్రైనింగ్&లెర్నింగ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. ఈ శిక్షణలో వివిధ కళాశాలల నుంచి అధ్యాపకులు, ఫ్యాకల్టీ పాల్గొని పరిశ్రమల్లో ఉత్పత్తుల్లో నాణ్యత నూతన అంశాలను నేర్చుకున్నారు. ముఖ్య అతిథులుగా సాంకేతిక విద్య ఏయూ రీజన్ ఆర్జేడీ, జె.సత్యనారాయణమూర్తి, ఏయూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొ.కె. రాంజీ, విశాఖ రిఫైనరీ డీజీఎం కె.ఇ.శ్రీధర్ తదితరలు హాజరై ప్రసంగించారు.ఆటోమేషన్ అన్నీ రంగాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఒ.రామ్మోహన్, ఎన్. చంద్రశేఖర్, డా.కె.వి.రమణ, కె.మధుకుమార్, అధ్యాపకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## నిరాశ్రయుడి అప్పగింత

**అక్కయ్యపాలెం, ఆగస్టు 24:** టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న ధర్మాన కర్రై న్న (65)ను శనివారం తన అల్లుడు విశ్వనాథానికి అప్పగించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగఢ వాసు తెలిపారు. ఆయన ఆర్టీసీ కాంప్లెక్స్‌లో దిక్కుతోచని స్థితిలో ఉండగా.. పోలీసుల సమాచారం మేరకు ఈ నెల 19వ తేదీన ఆయనను తీసుకువచ్చి వసతి గృహంలో ఆశ్రయం కల్పించినట్టు చెప్పారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి నిమ్మాడ గ్రామం నుంచి విశాఖకు వచ్చి బిక్షాటన చేస్తున్నారని పేర్కొన్నారు. మరోసారి విశాఖకు రావద్దని, వస్తే బెగ్గర్స్ హోంకి తరలించాల్సి ఉంటుందని మందలించి ఆయన అల్లుడు విశ్వనాథంకు అప్పగించామన్నారు.

## తులసీదళాలతో కనకమహాలక్ష్మికి పూజలు

**పూర్ణామార్కెట్, ఆగస్టు 24:** వన్‌టౌన్ కనకమహాలక్ష్మికి శనివారం ఉదయం తులసీదళాలతో అలంకరించి ప్రత్యేకంగా ఉభయదాతలతో పూజలు జరిపించారు. అలాగే, నిత్యపూజాధికాలతోపాటు శ్రావణమాసోత్సలో భాగంగా కుంకుమపూజలు, హోమం నిర్వహించారు. ఈ వో శ్రీనివాసులు రెడ్డి, జేఈవో వి.రాంబాబు పాల్గొన్నారు. భక్తులతో ఆలయం కళకళలాడింది.

## 'వృద్ధుల సంరక్షణలో ఏజ్‌కేర్ కృషి ప్రశంసనీయం'

**అక్కయ్యపాలెం, ఆగస్టు 24:** వృద్ధుల సంక్షేమం కోసం ఏజ్‌కేర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవలు ప్రశంసనీయమైనవని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఏజ్‌కేర్ ఫౌండేషన్ సంస్థ 12వ వార్షికోత్సవం దొండపర్తిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన గంటా మాట్లాడారు. సౌత్ ఏసియా ఎల్‌పీజీ ఉపాధ్యక్షుడు మధీజా, రెయిన్ కార్బన్ సంస్థ ఉపాధ్యక్షుడు విక్రమ్ వర్మ, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ ప్రక్షాళనపై హర్షం

**అక్కయ్యపాలెం, ఆగస్టు 24:** తిరుపతి దేవస్థానంలో ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ రూ.300 నుంచి రూ.200కు రాష్ట్ర ప్రభుత్వం తగ్గించడంపై టీడీపీ జిల్లా మీడియా కో ఆర్డినేటర్ కె.గోపాల్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనం సామాన్యులకు గగనమైపోయిందన్నారు. జగన్ హయాంలో స్వామివారి దర్శనం, సేవలు ఆన్‌లైన్‌లో విడుదల చేసిన క్షణంలో మొత్తం అయిపోయినట్లు చూపించేవారన్నారు. కానీ, ప్రస్తుతం చంద్రబాబు పాలనలో టీటీడీ ప్రక్షాళన ప్రా రంభమైందన్నారు. నవంబరు నెల దర్శనాల వివరాలను శనివారం ఉదయం ఆన్‌లైన్ విడుదల చేస్తే సాయంత్రం వరకు ఖాళీలు చూపడం, టికెట్ ధర తగ్గించడం హర్షణీయమన్నారు. ఈవిధమైన పరిస్థితేఉండాలని గత ఐదేళ్లుగా భక్తులు కోరుకున్నారన్నారు.

## జిల్లాస్థాయి డ్యాన్స్ పోటీలు

**డాబాగార్డెన్స్, ఆగస్టు 24:** విశాఖ జిల్లాలోని పాఠశాలల విద్యార్థుల్లో సృజనాత్మకను ప్రోత్సహించడానికి ఇంటర్ స్కూల్స్ డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ డైరెక్టర్ ఉజ్జన్సివ్ తెలిపారు. ఈ పోటీల్లో తొమ్మిది నుంచి 12 ఏళ్ల వారిని జూనియర్స్‌గా, 13 నుంచి 15 ఏళ్ల వారిని సీనియర్స్‌గా పరిగణిస్తామన్నారు. ప్రాథమిక స్థాయి పోటీలో పాల్గొనే విద్యార్థులు జానపద, శాస్త్రీయ, దేశభక్తి విభాగాల్లో నృత్యం మూడు నిమిషాల పాటు చిత్రీకరించి వాట్సాప్ నంబరు 72071 50372కు సెప్టెంబరు 10లోపు పంపించాల్సి ఉంటుందన్నారు. ఇందులో ఉత్తమ ప్రదర్శనను ఎంపిక చేసి సెప్టెంబరు 29న విశాఖలో జరిగే ఫైనల్స్ పోటీ నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ముందుగా ఫోన్: 85229 90123ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

## జూనియర్ వైద్యురాలి హత్యాచారంపై నిరసన



అక్సిజన్ టవర్స్ వద్ద కొవ్వొత్తులతో నిరసన

**సీతమ్మధార, ఆగస్టు 24:** కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచారాన్ని ఖండిస్తూ సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్‌లోని డాక్టర్స్.. రెసిడెంట్స్ కలిసి శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నల్ల దుస్తులు ధరించి వైద్యురాలి మృతికి సంతాపం తెలిపారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శివాజీ ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనూష, సైమిని, అన్నపూర్ణరావు, సురేఖ, ఉషారాణి, మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ భద్రత ఏర్పాట్లను పరిశీలించిన సీపీ


పోర్టు స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

**సీతంపేట, ఆగస్టు 24:** నగరంలోని పోర్టు స్టేడియంలో ఈ నెల ఆగస్టు 26 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరుగునున్న నేపథ్యంలో నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. వచ్చే నెల సెప్టెంబరు 5 వరకూ 11 రోజులపాటు జరగనున్న ఈ ర్యాలీలో అభ్యర్థులకు ఎటువటి ఇబ్బందులకు గురికాకుండా ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించారు. రోజూ హాజరయ్యే అభ్యర్థుల సంఖ్య, అందుకు తగిన వసతుల సమీక్షించారు. తొక్కిసలాటకు తావు లేకుండా ఏర్పాటు చేసిన బ్యారికేడ్లు, ఇతర అవసరమైన వసతులను పరిశీలించారు. ఆర్మీ అధికారులతో ఇతర భద్రతా ఏర్పాట్లను చర్చించారు.

## నేత్రదానంపై అవగాహన కల్పించాలి


నేత్రదాన పక్షోత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

**సీతంపేట, ఆగస్టు 24:** నే త్ర దానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో పి. జగదీశ్వరరావు కోరారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాంతీయ నేత్రవైద్యశాలలో 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎంహెచ్‌వో, నేత్రవైద్య శాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్య క్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్స్ భాగస్వాములుగా నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. నేత్రదానంపై అపోహలను తొలగించాలని సూచించారు. 15 రోజులపాటు నేత్రదానంపై కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ శ్రీలక్ష్మి, జూనియర్ వైద్యులు, సిబ్బంది, ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ మేనేజర్ అభినిత్ .జైన్, సిబ్బంది, పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్స్ ఉమా శ్రీనివాస్, ఆర్ సురేష్, ఐ డొనేషన్ కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం


వేదికపై ఎంపీ సియం రమేష్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, సోము వీర్రాజు

**మురళీనగర్, ఆగస్టు 24 ;** మురళీనగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి ఎంపీ సియం.రమేశ్, ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పార్టీ వ్యవస్థాపకుల ఫొటోలకు నివాళి అర్పించారు. అనంతరం సభ్యత్వ నమోదులో వచ్చిన టెక్నాలజీ మార్పులను వివరించారు. కార్యకర్తలు పార్టీ సభ్యత్వ నమోదులో చురుగ్గా వ్యవహరించాలని సూచించారు. సందేహాలకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పార్టీ ప్రధాన ఉద్దేశాలు, వికసిత్ భారత్ లక్ష్యాలను కార్యకర్తలకు వివరించారు. పలు ప్రాంతాల నాయకులు, విశాఖ జిల్లా ప్రతినిధులు కార్యక్రమంలో ఉన్నారు.

## ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా అచ్యుతరావు ఎన్నిక


సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావును సన్మానిస్తున్న కళాకారులు, ఉద్యోగులు

**డాబాగార్డెన్స్, ఆగస్టు 24:** ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్‌గా డా.కంచర్ల అచ్యుతరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి చవల మురళీకృష్ణ శనివారం తెలిపారు. సినీ నిర్మాతగా, విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘానికి అధ్యక్షుడిగా కంచర్ల సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల సినీ పరిశ్రమలో 24 క్రాఫ్ట్‌లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఏ ప్రాంతంలో షూటింగ్స్ జరిగితే ఆ ప్రాంత కార్మికులకే అవకాశం కల్పించి వారి జీవనోపాధికి సాయపడతానన్నారు. ఫెడరేషన్ అధ్యక్షుడు తోరంరాజా, ఉపాధ్యక్షుడు కొండపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## నాట్యకళలను ప్రోత్సహించాలి

**సీతంపేట, ఆగస్టు 24:** సంప్రదాయ కళలో భాగమైన నాట్యకళలను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ పేర్కొన్నారు. శంకరమఠం ఎదురుగా ఉన్న పద్మశాలి భవన్‌లో నటరాజ నృత్యనికేతన్ వ్యవస్థాపకుడు, నాట్య గురువు జి.పరమేశ్వరన్ సారథ్యంలో శనివారం నాట్యగజ్జల స్వీకరణ పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజశేఖర్ పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ఔన్నత్యాన్ని నాట్య కళలు చాటుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారిణి సుశీల నాగరాజు, భక్తమార్కేండేయ ట్రస్ట్ ప్రతినిధులు కె.సన్యాసిరావు, టివెంకటేశ్వర్లు, వి.కృష్ణమోహన్, బి.పి.ఎస్. కళ్యాణి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సింహాచలం రైల్వే స్టేషన్‌లో రూ.12.69 కోట్లతో పాదచారుల వంతెన

**విశాఖపట్నం, ఆగస్టు 24:** సింహాచలం రైల్వే స్టేషన్‌లో పొడవైన పాదచారుల వంతెన పునర్నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. చంద్రనగర్, సింహాచలం రైల్వే స్టేషన్ మధ్య ప్రజల రాకపోకల కనెక్టవిటీ సౌకర్యార్థం పాత పాదచారుల వంతెన స్థానంలో కొత్తది నిర్మించేందుకు ఆమోదం లభించింది. దశాబ్దాల నాటి పాత ఫుట్ ఓవర్ బ్రిడ్జితో స్థానిక నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యను వాల్తేరు డివిజన్ డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ గుర్తించి జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఇటీవల ఈ స్టేషన్‌లో జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ పరిశీలించిన మీదుట కొత్త వంతెన నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా ఏడు ట్రాక్‌లను దాటేందుకు అనువుగా 115మీ. పొడవు, మూడు మీటర్లవెడల్పుతో కొత్త పాతచారుల వంతెనకు రూ.12.69 కోట్ల నిధులను మంజూరు చేశారు. కాగా అమృత్ స్టేషన్ పథకంలో భాగంగా సింహాచలం స్టేషన్ కొత్త భవనంతోపాటు మరో ప్రవేశ ద్వారం, అదనపు పార్కింగ్ సౌకర్యం తదితరాలు అందుబాటులోకి రానున్నాయి.

## ఎయిడ్స్‌పై అవగాహనకు 5కే మారథాన్


విజేతలతో అతిథులు, నిర్వాహకులు

**సీతమ్మధార, ఆగస్టు 24:** ఎయిడ్స్ నియంత్ర సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై యువతలో అవగాహన పెంపొందించేందుకు యూత్ ఫెస్ట్ 5కే రెడ్ రన్ మారథాన్‌ను బీచ్ రోడ్డులో శనివారం కాళీమాత ఆలయం వద్ద ప్రారంభించారు. వివిధ కళాశాల నుంచి 150 మంది విద్యార్థులు, జిల్లా క్రీడా శాఖ, నెహ్రూ యువ కేంద్ర, ఉన్నత విద్య శాఖ, కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్బు, కళాశాలల ఎన్ఎస్ఎస్ విభాగాల అధికారుల సహకారంతో ఈ కార్య క్రమం చేపట్టారు. తొలుత ఈ మారథాన్‌ను జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ నివారణ అధికారి సీహెచ్ పూర్ణేంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ రహిత జిల్లాగా మార్చడంతో ప్రముఖ పాత్ర వహించాలన్నారు. రన్‌లో విజేతలుగానిలిచిన వారికి సర్టిఫికేట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలోఉమామహేశ్వరరావు, డీఐఎస్ భద్రి, స్పోర్ట్ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

## జడ్పీ సీఈవోకు ఘనంగా వీడ్కోలు


సీఈవో దంపతులను సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

**మహారాణిపేట, ఆగస్టు 24:** జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ విధులు నిర్వహించిన ఎం. పోలినాయుడు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఓఎస్‌డీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఉద్యోగులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆధ్వ ర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఈవో జి. సత్యనారాయణ, కె. శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



విశ్వతేజ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు

**అక్కయ్యపాలెం, ఆగస్టు 24 :** తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ పాఠశాలలో శ్రీకృష్ణష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు విద్యార్థులు కృష్ణాష్టమి వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.భాస్కరరావు, వైస్ ప్రిన్సిపాల్ ఐ.సునీత తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుడి చట్టంతో ఎంతో మేలు

**డాబాగార్డెన్స్, ఆగస్టు 24:** వినియోగదారుల చట్టంతో అన్ని వర్గాలు న్యాయం పొందవచ్చుని సుప్రీంకోర్టు న్యాయవాది, అడ్వకేట్స్ అసోసియేషన్ అవేర్నెస్ (ఆశ్రా) వ్యవస్థాపకుడు హబీబ్ సుల్తాన్ ఆలీ తెలిపారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైద్యుల నిర్లక్ష్యంపై ఒక వినియోగదారుడు కేసు వేసి నష్టపరిహారంగా రూ.21.60 లక్షలు పొందినట్టు చెప్పారు. ఆశ్ర సంస్థ దేశంలోనే అతిపెద్ద వినియోగదారుల సంస్థ అన్నారు. 2500 అవగాహన శిబిరాలు , బీమా కేసులు, సేవాలోపం అంశాలపై 275 కేసులు వేశామన్నారు. ఈ సమావేశంలో ఆశ్ర రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది తోట శత్రుఘ్నుడు, సభ్యులు మహ్మద్‌ఇక్బాల్ జి.కిషోర్‌కుమార్, ఎండీ నజీమ్, జి. శ్యామలాదేవి, పి. హైమ పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలపై దృష్టి మరలకుండా చూడాలి


మాట్లాడుతున్న బాలల కమిషన్ సభ్యుడు సీతారామ్

**సీతమ్మధార, ఆగస్టు 24:** పిల్లలు మాదకద్రవ్యాలు వైపు మరలకుండా స్కూల్ యాజమాన్యాలు సహరించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారామ్ కోరారు. సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు, వార్డు సచివాలయాల కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో లైంగిక దాడులపై చిన్నారులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ సైకాలజీ విభాగం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, పిల్లల మనస్తత్వ నిపుణులు ఎం.సాయి వంశీ, పార్వతి కాశ్యప్, ఐసీడీపీ పీవో వెంకటేశ్వరి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.విజయ, డీసీపీయూ ప్రతినిధులు కె.శారద, కె.శకుంతల, ఆనంద్, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్స్ కె.మనోజ్, కె.విజయకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈపీడీసీఎల్ సీవీఓగా రామకృష్ణప్రసాద్


సీఎండీ పృథ్వీతేజ్‌ను కలిసిన సీవీఓ రామకృష్ణ ప్రసాద్

**విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):** తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా నియమితులైన కె.రామకృష్ణప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ పృథ్వీతేజ్‌ను కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ, సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి సర్కిళ్ల వినియోగదారులు దీర్ఘకాలకంగా పరిష్కారం కాని విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, విద్యుత్ చౌర్యానికి సంబంధించిన ఫిర్యాదులు టోల్ ఫ్రీ నంబరు 1912కి తెలియజేయాలని కోరారు.

## ప్రత్యేకావసరాల గల పిల్లలకు డిజిటల్ విద్య: డీఈవో

**కంచరపాలెం, ఆగస్టు 24 :** ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు డిజిటల్ విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపున్నట్టు డీఈవో ఎల్.చంద్రకళ పేర్కొన్నారు. ఆర్కే బీచ్ సమీపంలో యూత్ హాస్టల్‌లో శనివారం సహిత విద్య రీసోర్సు పర్సన్స్‌కు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడారు. దివ్యాంగ విద్యా ర్థుల్లో అభ్యాసన ఫలితాలను రాబట్టేందుకు సమగ్ర శిక్ష ద్వారా ట్యాబుల పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఈ ట్యాబులు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష రాష్ట్ర విభాగం కన్సల్టెంట్ డాక్టర్ నరశింహం, సహాయక సమన్వయకర్త డా.ఎన్. అమ్మినాయుడు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గీత, డి. అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మా ప్రమాదాలపై అఖిలపక్షం

... 5వ పేజీ తరువాయి

లోపాలు ఉన్నట్టయితే లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫార్మా కంపెనీలలో నెలకొన్న పరిస్థితులపై చర్చ జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, వి.విమల ఎస్‌కే రహమాన్ పి.చంద్రశేఖర్, మన్మధరావు క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

తప్పనిసరిగా ఏడాదికి ఒకసారి సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి. వీటిని తనిఖీ చేసే సాంకేతిక పరిజ్ఞానం ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులకు ఉండదు కాబట్టి థర్డ్ పార్టీ ఏజెన్సీలతో ఆడిట్ నిర్వహించి నివేదిక సమర్పించాలి. విశాఖపట్నం జిల్లాలో 57 పరిశ్రమలు ఉన్నాయి. వాటిలో కేవలం పది మాత్రమే ఈ సేఫ్టీ ఆడిట్ ప్రతి ఏడాది నిర్వహిస్తున్నాయి. హెచ్‌పీసీఎల్, కోరమండల్, స్టీల్‌ప్లాంటు, ఐఓసీ ఇలా భారీ పరిశ్రమలు ఆ జాబితాలో ఉన్నాయి. మిగిలిన 47 పరిశ్రమలు థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్ చేయాల్సిన అవసరం లేదు. చట్టంలో ఈ లొసుగు ఉండడంతో ప్రైవేటు పరిశ్రమలు సేఫ్టీ ఆడిట్‌ను గాలికి వదిలేస్తున్నాయి. కొన్ని ఆడిట్ చేయించినా, నిపుణులు చేసిన సూచనలు పాటించడం లేదు. ఎసెన్షియా అదేవిధంగా వ్యవహరించడం వల్ల భారీ ప్రమాదం జరిగింది.

**జాయింట్ సేఫ్టీ ఆడిట్ తప్పనిసరి**

పరిశ్రమ అయినా, వ్యాపార సముదాయమైనా, ప్రభుత్వ సంస్థ అయినా భద్రత చాలా ముఖ్యం. ప్రభుత్వం ఆదేశించకపోయినా తప్పనిసరిగా భద్రత ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయా? లేదా?..అని చూసుకోవాలి. షాపింగ్‌మాల్స్ సినిమా థియేటర్లు, భారీ వాణిజ్య సముదాయాలు, పరిశ్రమల్లో అప్పుడప్పుడు మాక్ డ్రిల్ నిర్వహించి, ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్ పనితీరు, ప్రమాదం జరిగితే తప్పించుకునే విధానం వంటివి సిబ్బందికి తెలియజేయాలి. ప్రతి పరిశ్రమలో అన్ని శాఖల అధికారులు కలిసి జాయింట్ సేఫ్టీ ఆడిట్ చేయవచ్చు. దీనికి జిల్లా అధికారి నేతృత్వంలో కమిటీని వేసి, అమలు చేయాలి. ఈ విధానం సరిగ్గా అమలు కావడం లేదు. సమీక్షలు ఉండడం లేదు. ఎసెన్షియా ప్రమాదం తరువాత ప్రభుత్వం వీటిపై దృష్టిసారించింది.

**ఎవరికి వారే..?**

జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని ప్రమాదాలు జరిగాయి? ఎంత మంది చనిపోయారు? అని అమరావతి నుంచి వచ్చిన ఉన్నతాధికారి ప్రశ్నించినప్పుడు అన్ని శాఖల అధికారులు తెల్లముఖాలు వేశారు. పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్లు..ఇలా ఎవరికి వారు తమ దగ్గర డేటా లేదంటే..తమ దగ్గర లేదని సమాధానం ఇచ్చారు. ఇకపై జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఈ సమాచార సేకరణ, నిర్వహణ జరగాలని సూచించారు.

**సమాచారం ఇవ్వకుండానే చికిత్సలు**

ఎసెన్షియాలో ప్రమాదం జరిగిన రెండో రోజే పరవాడలోని రాంకీ ఫార్మాసిటీలోని సినర్జీన్ కంపెనీలో రియాక్టర్ వద్ద ప్రమాదం జరిగింది. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం అధికారులకు తెలియజేయకుండానే బాధితులను ఆస్పత్రికి తరలించారు. కొన్ని గంటల తరువాత ఈ విషయం ప్రజా ప్రతినిధుల దృష్టికి రావడంతో అధికారులను ప్రశ్నించారు. వారు మళ్లీ తెల్లముఖం వేశారు. పరిశ్రమలు, ప్రభుత్వానికి మధ్య కమ్యూనికేషన్ లేదని, బాధ్యతగా వ్యవహరించడం లేదని గుర్తించి హెచ్చరికలు చేశారు. ఏ ఆస్పత్రి అయినా సరే ఇలాంటి కేసులు వచ్చినపుడు చికిత్స ప్రారంభిస్తూనే జిల్లా యంత్రాంగానికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

# వారంలోగా భద్రతా ఆడిట్

... 5వ పేజీ తరువాయి

ప్రతిస్పందన, స్వీయరక్షణపై కార్మికులు, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలన్నారు. కాలం చెల్లిన యంత్రాలను మార్చాలని, భద్రతాపరమైన యంత్రాంగాన్ని రూపొందించుకోవాలన్నారు. సమీపంలోని ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా ప్రశాంత వాతావరణంలో పరిశ్రమలను నిర్వహించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, జాయింట్ సీపీ ఫకీరప్ప, డిప్యూటీ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం గణపతి, కాలుష్య నియంత్రణమండలి ఈఈ ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కర్మాగారంలో 17 మంది మృతిపై సమావేశం విచారం వ్యక్తంచేస్తూ వారి మృతికి సంతాపం ప్రకటించి రెండు నిమిషాలు మౌనం పాటించింది.

# డెంగ్యూ అలజడి

... 5వ పేజీ తరువాయి

నిర్ధారించి, కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. కేజీహెచ్‌లో బాలుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. బాలుడు మృతికి డెంగ్యూ సోకడమే కారణమని అనకాపల్లిలోని వైద్యులుచెప్పారని బాలుడు కుటుంబసభ్యులు చెబుతుంటే... జీవీఎంసీ అధికారులు మాత్రం కేవలం డెంగ్యూ లక్షణాలు మాత్రమేనని, ఇంకా అధికారికంగా నిర్ధారణ కాలేదంటూ చెబుతున్నారు.

**జీవీఎంసీ అధికారులు అప్రమత్తం**

డెంగ్యూ కేసులు తీవ్రస్థాయిలో నమోదయ్యే అవకాశం ఉందనే సంకేతాల నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. దోమల నియంత్రణ కోసం యాంటీ లార్వా ఆపరేషన్ ప్రారంభించారు. సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లోని ఇంటింటికీ వెళ్లి దోమల లార్వాలను గుర్తించి నిర్వీర్యం చేసే పనికి శ్రీకారం చుట్టారని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ వివరించారు. డెంగ్యూ తీవ్రత గత ఏడాదితో పోల్చితే తక్కువగానే ఉందని, ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

# వైసీపీ నేత బరితెగింపు

... 5వ పేజీ తరువాయి

చేయలేదు. భవన యజమాని వైసీపీ నేత కావడం వల్లే టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ భవనంలో దుకాణాలకు మంచి డిమాండ్ ఉండడం, భారీగా అద్దెలు వస్తుండడంతో అదనంగా మరో అంతస్తు నిర్మించేందుకు యజమాని సిద్ధమయ్యారు. ఈ ఏడాది జనవరిలో పనులు ప్రారంభించారు. దీనిపై స్థానికులు కొంతమంది జోన్-2 టౌన్‌ప్లానింగ్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు పత్రికల్లో వార్తలు రావడంతో అధికారులు తప్పనిసరి పరిస్థితిలో భవనం వద్దకు వెళ్లారు. నిర్మాణ పనులను కొంతకాలం ఆపాలని యజమానిని వేడుకున్నారు. అధికారం అండగా ఉందనే ధీమాతో యజమాని వారిపై తిరగడడమే కాకుండా దూషణకు దిగారు. దీనిపై సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేసినా అధికార పార్టీ నేత కావడంతో పోలీసులు సైతం కేసు లేకుండా నచ్చజెప్పి పంపించేశారు. తర్వాత వైసీపీ అధికారం కోల్పోవడంతో నిర్మాణ పనులను సదరు భవన యజమాని నిలిపివేశారు. ఏమైందోగానీ మళ్లీ భవన నిర్మాణ పనులు చేపడుతుండడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ విషయం జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా...నిర్మాణాలను నిలిపివేయించి, టీడీఆర్ జారీచేసిన మేరకు స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తోంది. జీవీఎంసీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పి.సంపత్‌కుమార్ అయినా దీనిపై దృష్టిసారించి, అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అనధికార ఇసుక నిల్వలపై నిఘా

**భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 24 :** నియోజకవర్గంలో అనధికార ఇసుక నిల్వలు ఎక్కడ ఉన్నా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్‌ఈబీ ఎస్‌ఐ పి. చిన్నంనాయుడు తెలిపారు. శనివారం ఆయన గోస్తనీ నది వద్ద ఉన్న ఇసుక ర్యాంపులను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గోస్తనీ నది నుంచి ఇసుక అక్రమంగా తరలకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనధికారికంగా ఇసుక నిల్వలు ఉన్నా, అనుమతి లేకుండా ఇసుక అమ్మకాలు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. చాలామంది ఇళ్ల నిర్మాణాల కోసం ఇసుక తీసుకుని వచ్చి తమ ఇళ్ల ముందు కుప్పలుగా పోస్తున్నారని, ఆ ఇసుక ఎక్కడి నుంచి తీసుకువచ్చారో తమకు వివరాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. నిబంధనల ప్రకారం నిర్మాణదారులు ఇసుకను అధికారికంగా కొనుగోలు చేయాలని కోరారు. గోస్తనీ పరివాహక ప్రాంతంలో కొందరు ఇసుక ర్యాంపులు నిర్వహిస్తూ, వ్యాపారాలు చేస్తున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రధాన రహదారుల వద్ద వాహనాల రాకపోకలకు అడ్డంగా ఇసుక కుప్పలున్నా, రాళ్ల కుప్పలు, ఇటుకలు ఉన్నా అటువంటి వారిని గుర్తించి నోటీసులు జారీ చేస్తామని చెప్పారు.

## కుసులవాడలో మైనింగ్ తవ్వకాల నోటిఫికేషన్ రద్దు చేయాలి : సీపీఎం

**తగరపువలస, ఆగస్టు 24 :** ఆనందపురం మండలంలోని కుసులవాడలో మైనింగ్ తవ్వకాలకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు, కార్పొరేటర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన చిట్టివలసలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కుసులవాడ క్వారీలో కార్బ్‌జైట్ ఉన్నట్టు బయటపడిందని, దీన్ని తవ్వితే పరిసర గ్రామాలకు చెందిన వారు చాలా ఇబ్బంది పడతారని చెప్పారు. ఇప్పటికే ఆయా గ్రామాలకు చెందిన వారు ఆందోళనలు చేస్తున్న దృష్ట్యా కొండలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉందన్నారు. పర్యావరణానికి తీవ్ర హాని తలపెట్టే మైనింగ్‌ను నిలుపుదల చేయాలని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవలసి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో ఆయనతో పాటు పార్టీ నాయకులు భాగం లక్ష్మి, ఆర్. నరసింగరావు ఉన్నారు.

## వినాయక ఉత్సవాలకు పందిరి రాట

**భీమునిపట్నం, ఆగస్టు 24 :** పట్టణంలోని చిన్నబజారు అప్పికొండ వీధి వద్ద జరగనున్న వినాయక ఉత్సవాలకు శనివారం పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో నాగవంశ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, కంటుభుక్త ముత్యాలరావు, బింగి హరికిరణ్‌రెడ్డి, కనకల అప్పలనాయుడు, జోని సంజీవరావు, ఉత్సవ కమిటీ నాయకులు రాంభుక్త ప్రభాకర్‌నాయుడు, ప్రగడ చంటి, అప్పికొండ బాలకృష్ణ, గిడుతూరి రాజు, లచ్చుబోతు సంతోష్, జయంతి శ్రీను, చందక రాజశేఖర్, జరజాపు సురేష్, ముకుంద సంతోష్, మొకర గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**భీమునిపట్నం, ఆగస్టు 24 :** పట్టణంలోని ది సన్ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, బలరాముడు, గోపికలు, యశోద, రాధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. అలాగే శ్రీకృష్ణ నామ సంకీర్తనలు, చిన్నారుల కోలాటం అలరించాయి. ఈ కార్యక్రమంలో ది సన్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ కైతపల్లి లావణ్య ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ఆనందపురం :** మండలంలోని పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వెల్లంకి రవీంద్రభారతి పాఠశాలలో జరిగిన వేడుకల్లో విద్యార్థులు రాధాకృష్ణుడి వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణాష్టమి వేడుకల విశిష్టతను కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. ఉమా మహేష్ వివరించారు. అలాగే నీళ్లకుండీలులో ఉన్న శ్రీసాయి స్వామి వివేకానంద పాఠశాలలోనూ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, యశోద, గోపికలు, వసుదేవుడు తదితర వేషధారణలతో అలరించారు. ఎల్‌వీపాలెంలో దుర్గా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలోనూ వేడుకలు జరిగాయి.

**కొమ్మాది :** బక్కన్నపాలెం రోడ్డులోని చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శని వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అల రించాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సందీప్, వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరావు, జోనల్ ప్రైమరీ ఇన్‌చార్జి శైలజ, తదితరులు పాల్గొన్నారు.

### సినిమా గైడ్

- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** సంగం, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), విశేష్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **డిమోంటీ కోలనీ-2 :** మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **తంగలాన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), తాతా (తగరపువలస)
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, శ్రీకన్య (గాజువాక)
- **ఆర్.కె.పురంలో :** శ్రీకాంతి

### రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 47, టమాటా 27, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 22, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 30, బీరకాయలు 34, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 26, క్యారెట్ 32, దొండకాయలు 26, బంగాళదుంపలు 32, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 120, బరబటి 24, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 30, దోసకాయ 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 40, కీరదోస 30, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

### కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 505 |
| విజయనగరం | 509 |
| శ్రీకాకుళం | 509 |

### చికెన్ ధరలు

| బ్యాగ్ | | |
|---|---|---|
| రైతు ధర | -- | 95 |
| ఫారం ధర | -- | 115 |
| విత్ స్కిన్ | -- | 200 |
| స్కిన్‌లెస్ | -- | 210 |

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

# ఇరుకు రోడ్లు.. ట్రాఫిక్ అవస్థలు

- విస్తరణకు నోచుకోని పట్టణ రహదారులు
- వాహనాల రద్దీతో నిత్యం అవస్థలు
- ఏళ్ల తరబడి సమస్య
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అధికారుల ప్రతిపాదనలు
- వైసీపీ పాలనలో నిర్లక్ష్యం
- కూటమి అధికారంలోకి రావడంతో చిగురిస్తున్న ఆశలు



బస్టాండ్ రోడ్డులో వాహనాల రద్దీ

**భీమునిపట్నం, ఆగస్టు 24 :** పట్టణ రహదారులు ఇరుగ్గా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారి విస్తరణ ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉన్నా.. ఆచరణకు నోచుకోవడం లేదు. దీంతో ప్రజలకు రోజూ ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. పాలకులు, అధికారులు నిత్యం ట్రాఫిక్ కష్టాలను స్వయంగా చూస్తున్నా.. ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.చారిత్రాత్మక డచ్ సిటీగా వున్న పట్టణాన్ని చూద్దామని ఇక్కడికి వచ్చిన సందర్శకులకు ఇరుకు రోడ్లు, సౌకర్యాల లేమి వల్ల అసహనానికి గురవుతున్నారు. మెయిన్ రోడ్‌లో ఒక బస్సు వస్తే పక్కన కనీసం టూ వీలర్ కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది.



విస్తరణకు నోచని గంట స్తంభం రోడ్డు

### ఆరు రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు

2014లో అప్పటి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పట్టణంలో ఆరు ప్రధాన రహదారులను విస్తరించాలని సర్వే చేయించారు. తర్వాత ప్రభుత్వం మారడంతో ఈ అంశం మరుగునపడిపోయింది. ప్రస్తుతం మళ్లీ ఆయనే ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో రహదారుల విస్తరణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఇటీవల ఆయన పట్టణంలో పర్యటించినపుడు జీవీఎంసీ జోనల్ అధికారులను రహదారుల విస్తరణ ఫైల్‌ను తన టేబుల్‌పై పెట్టాలని ఆదేశించారు. బీచ్ రోడ్‌లో ఎస్‌టిఎస్ జంక్షన్ నుంచి పోలీస్ స్టేషన్ వరకూ ప్రస్తుతం వున్న 25-30 అడుగుల రహదారిని 66 అడుగులకు, ఎస్‌బీఐ జంక్షన్ నుంచి బీచ్‌రోడ్ మీదుగా ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ జంక్షన్ వరకూ 20-30 అడుగులు వున్న రహదారిని 66 అడుగులకు విస్తరించాలని గతంలో ప్రతిపాదన చేశారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రభుత్వాస్పత్రి, మెయిన్ రోడ్ మీదుగా గంటస్తంభం వరకూ ప్రస్తుతం వున్న 20-25 అడుగుల రహదారిని 66 అడుగులకు, గంట స్తంభం నుంచి పోలీస్ స్టేషన్ వరకూ వున్న 25-30 అడుగుల రహదారిని 66 అడుగులకు విస్తరించాలని యోచించారు. భీమిలి పోలీస్ స్టేషన్ నుంచి తగరపువలసకు వున్న 40 అడుగుల రహదారిని 150 అడుగులకు, చిన్నబజారు జంక్షన్ నుంచి దొరతోట వరకూ ఉన్న 40 అడుగుల రహదారిని 100 అడుగులకు విస్తరించాలని భావించారు. చిన్నబజారు జంక్షన్ నుంచి తాళ్లవలస మీదుగా జాతీయ రహదారిని కలుపుతూ రహదారిని 80 అడుగులకు విస్తరించాలని ప్రతిపాదనలు వున్నాయి. ఏళ్లు గడుస్తున్నా రోడ్ల విస్తరణ అంశం కార్యరూపం దాల్చకపోడంతో పట్టణ రూపురేఖలు మారకపోవడంతో వాహనదారులు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. రహదారుల విస్తరణకు మోక్షం కలగడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారుల విస్తరణతో పాటు పుట్‌పాత్‌లు, వాహనాల పార్కింగ్, సెంట్రల్ లైటింగ్, తదితర సదుపాయాలు ఏర్పాటు చేసి పట్టణాన్ని సుందరీకరించాలని పలువురు కోరుతున్నారు.

### నరకయాతన పడుతున్నాం



మెయిన్ రోడ్డు ఇరుగ్గా ఉండడంతో 20 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. ఈ రోడ్డులో ఒక్క బస్సు వస్తే మరో వాహనం వెళ్లడం కష్టం. ప్రతిరోజూ ఇవే కష్టాలున్నా..ఎవరూ పట్టించుకోవడం లేదు.

**పాసి మధుసూదనరావు, గొల్లవీధి**

### మెయిన్ రోడ్ విస్తరణ చాలా అవసరం



మెయిన్ రోడ్డును విస్తరించడం చాలా అవసరం. 50 ఏళ్ల క్రితం అప్పటి జనాభాకు అనుగుణంగా పట్టణ రోడ్లు నిర్మించారు. ప్రస్తుతం జనాభా పెరగడంతో పాటు పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రోడ్లను విస్తరించాల్సి ఉంది.

**కదిరి జగన్నాథరావు, బోయవీధి**

# ఇసుక అక్రమ రవాణాపై చర్యలు : తహసీల్దార్

**పద్మనాభం, ఆగస్టు 24 :** అనుమతి లేకుండా సొంత భూముల్లో ఇసుక తవ్వకాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆనందకుమార్ చెప్పారు. 'గోస్తనీలో దొంగలు పడ్డారు' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఈమేరకు ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని తహసీల్దార్‌తో పాటు ఎస్‌ఈబీ ఎస్సై చిన్నంనాయుడు పరిశీలించారు. తవ్వకాలు

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

చేపట్టిన ప్రాంతంలో జిరాయితీ భూమితో పాటు ప్రభుత్వ భూమి కూడా ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గనులు, భూగర్భ వనరుల చట్టం ప్రకారం సొంత భూముల్లో ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నా.. ప్రభుత్వ అనుమతి అవసరమన్నారు. పంట భూముల్లో ఇసుక తవ్వకాలు చేపట్టిన రైతులను గుర్తించి నోటీసు జారీ చేస్తామన్నారు. పోగులు పోసిన ఇసుకను ఒకచోట వేసి భద్రపరచాలన్నారు. ఇసుక రవాణా కోసం వేసిన దారుల్లో ట్రెంచ్‌లు తవ్వాలని వీఆర్వో, ఆర్‌ఐను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కోటి, మండల సర్వేయరు లీల, వెలుగు సర్వేయరు శివ తదితరులు పాల్గొన్నారు. కాగా ఇసుక అక్రమ రవాణాను నిరోధించడానికి సీఐ శ్రీధర్ ఇద్దరు కానిస్టేబుళ్లను బందోబస్తుగా ఏర్పాటు చేశారు.



ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనందకుమార్, ఇతర అధికారులు

## మాజీ మేయర్ ఎన్‌ఎస్‌ఎన్ రెడ్డికి నివాళి

**పెదవాల్తేరు, ఆగస్టు 24 :** బీజేపీ నాయకుడు, మాజీ మేయర్ ఎన్‌ఎస్‌ఎన్ రెడ్డి వర్ధంతి సభ నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, తదితరులు రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం రవీంద్ర మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎన్ రెడ్డి 1981లో విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసి బీజేపీ నుంచి 24 మంది కార్పొరేటర్లతో విజయం సాధించి మేయర్ అయ్యారన్నారు. ఆయన హయాంలో నగరం ఎంతగానో అభివృద్ధి చెందిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ ప్రకాశ్‌రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి విజయానంద రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ధ లక్ష్మీనారాయణ, బాల రాజేశ్వరరావు, ఎస్‌పి రామ్మోహన్, జె. దామోదర్‌యాదవ్, శ్రీరంగం ధనేశ్వరరావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత రాజ్ పాల్గొన్నారు.

## అత్యాచారం నిందితులను శిక్షించాలి : సీఐటీయూ

**ఆరిలోవ, ఆగస్టు 24 :** కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ డిమాండ్ చేశారు.శనివారం జూపార్క్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జూపార్కు వద్ద కోల్‌కతా ఘటనపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు కాపాడుతున్న వైద్యుల ప్రాణాలకు రక్షణ లేకపోవడం దుర్మార్గపు చర్య అన్నారు. 36 గంటల పాటు డ్యూటీ చేసి సెమినార్ హాలులో విశ్రాంతి తీసుకుంటున్న విద్యార్థినిపై అతికిరాతకంగా సామూహికంగా అత్యాచారం చేసి, హత్య చేయడం అమానుషం అన్నారు. ఈ కార్యక్రమంలో జూపార్క్ యూనియన్ నాయకులు నరేష్ రాజు, పైడిరాజు, నరసింగరావు, మురళీ, దిలీప్, శోభ, కనకమ్మ, శ్రీను, రామారావు పాల్గొన్నారు. అలాగే ఆరిలోవ రిఫరల్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కూడా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత, తదితరులు పాల్గొన్నారు.



రిఫరల్ ఆస్పత్రి వద్ద నిరసన వ్యక్త చేస్తున్న వైద్యులు

## 'ప్రచారం కోసం జగన్ ఆరాటం'

**సిరిపురం, ఆగస్టు 24 :** అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారి కూడా మీడియా ముందుకు రాని జగన్ అధికారం పోయిన తరువాత ప్రచారం కోసం తెగ ఆరాట పడుతున్నారని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ అన్నారు. శనివారం ఆయన ఫార్మా ప్రమాద బాధితులను మెడికవర్ ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌కు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఇంకుడు గుంతలపై అవగాహన

**సిరిపురం, ఆగస్టు 24 :** ప్రతి ఇంట్లో విధిగా ఇంకుడు గుంత ఉండాలని బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి రామేశ్వరి కోరారు. సంఘ మిత్ర సంస్థ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం ఆమె ఇంకుడు గుంతలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన వర్షపు నీరు వృథాగా కాలువల ద్వారా సముద్రంలో కలిసిపోవడం విచారకమన్నారు. అమెరికా వంటి దేశాల్లో ఇంకుడు గుంతలు తప్పనిసరి అన్న నిబంధనలు ఉన్నాయని గుర్తుచేశారు. సంఘమిత్ర అధినేత సూరిబాబు మాట్లాడుతూ ప్రజల్లో ఇంకుడు గుంతల పట్ల అవగాహన పెరగాలన్నారు. ప్రతి ఇంటి నిర్మాణంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, హరి పాల్గొన్నారు.

## 'ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం'



విజేతలతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

**ఎంవీపీ కాలనీ, ఆగస్టు 24 :** నావెల్ డాక్ యార్డ్ షాప్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించిన 15 మంది కేటీబీ అసోసియేషన్ సభ్యులను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో అభినందించారు. డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు బత్తుల చిరంజీవి నేతృత్వంలో విజయం సాధించిన ఉద్యోగులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ డాక్ యార్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



## కమనీయం..అప్పన్న నిత్య కల్యాణం

**సింహాచలం, ఆగస్టు 24 :** వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

## ట్రాన్స్‌జెండర్ల పట్ల వివక్ష చూపరాదు

**భీమునిపట్నం, ఆగస్టు 24 :** ట్రాన్స్ జెండర్ల పట్ల ఎవరూ వివక్ష చూపకూడదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విష్ణుమూర్తి అన్నారు. శనివారం ఆయన ఆ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్లకు కూడా విద్య, ఉద్యోగావకాశాల్లో సమాన హక్కులున్నాయని, వారి పట్ల చిన్నచూపు ఉండకూడదన్నారు. ముఖ్య అతిథి కోమల మాట్లాడుతూ లెస్బియన్లు, గే, బై సెక్సువల్, ట్రాన్స్‌జెండర్, క్వీర్, ఇంటర్ సెక్స్, ఆసెక్సువల్‌ల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఆమెను కళాశాల అధ్యాపకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ప్రవీణ, అప్పలనాయుడు, శ్రీను, అకడమిక్ కో ఆర్డినేటర్ సహదేవుడు, వై. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు పూర్వ విద్యార్థుల కలయిక

**భీమునిపట్నం, ఆగస్టు 24 :** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 45 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో కలవనున్నట్టు పూర్వ విద్యార్థుల ఆహ్వాన కమిటీ కన్వీనర్, రిటైర్డ్ హెచ్‌ఎం కనకల సన్యాసినాయుడు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 నుంచి పాఠశాలలో కార్యకమం జరుగుతుందని, అందుబాటులో వున్న వారంతా హాజరుకావాలని కోరారు.



జగనన్న కాలనీ సమీపంలో తవ్వుతున్న గ్రావెల్

## తునివలసలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

**పద్మనాభం (రూరల్), ఆగస్టు 24 :** మండలంలోని తునివలస సమీపంలో జగనన్న కాలనీకి ఆనుకుని ఉన్న కొండపై గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. గత రెండు రోజులుగా తవ్వకాలు మరింతగా జోరందుకున్నాయి. ఇక్కడ తవ్వుతున్న గ్రావెల్‌ను విజయనగరం ప్రాంతానికి తరలించుకుపోతున్నారు. గ్రామస్తులు స్థానిక వీఆర్‌ఏ దృష్టికి తీసుకురావడంతో శనివారం ఆయన యువకుల సహకారంతో తవ్వకాలను అడ్డుకున్నారు. అక్రమ తవ్వకాల గురించి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్టు గ్రామ మాజీ సర్పంచులు ఆర్‌ఏఎస్ మూర్తి, గులమజ్జి మహేశ్వరరావు తెలిపారు. కాగా ఈవిషయమై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా తవ్వకాలు చేపడుతున్న వారికి వీఎంఆర్‌డీఏ అనుమతులు ఉన్నాయని, గ్రావెల్‌ను వేరే ప్రాంతాల్లో జగనన్న కాలనీల్లో రోడ్ల నిర్మాణానికి తీసుకువెళుతున్నట్టు చెప్పారు. కాగా గ్రావెల్ తరలింపునకు అనుమతి ఉందని చెబుతున్న యజమానులు సంబంధిత పత్రాలను చూపకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## అప్పన్న ఆదాయానికి సిబ్బంది గండి

**సింహాచలం, ఆగస్టు 24 :** వరాహలక్ష్మీనృసింహస్వామి ఆదాయానికి సిబ్బంది తరచూ గండి కొడుతున్నారు. గతంలో టికెట్ల రీసేల్ ద్వారా చేతివాటం ప్రదర్శించిన సిబ్బంది, తాజాగా భక్తుల నుంచి అనధికార వసూళ్లకు పాల్ప డుతున్నారు. సింహగిరిపై భక్తులు సెల్‌ఫోన్లు, సామగ్రి భద్రపరుచుకునే కౌంటర్లను కొన్ని నెలలుగా దేవస్థానం స్వయంగా నిర్వహిస్తోంది. ఆయా కౌంటర్లలలో దేవస్థానానికి చెందిన నాల్గవ తరగతి సిబ్బందిని, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ఈఓ నియమించారు. ఈమేరకు ప్రధాన రాజగోపుర సమీపంలోని సెల్‌ఫోన్లు భద్రపరచు కౌంటర్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగి సుమారు రూ.900 అదనపు వసూళ్లకు పాల్పడినట్టు ఇన్‌చార్జి ఏఈఓ పాలూరి నరసింగరావు శనివారం చేపట్టిన తనిఖీల్లో వెల్లడైంది. కౌంటర్‌లో ఉండాల్సిన దాని కంటే అదనపు సొమ్ము ఉన్నట్టు ఏఈఓ తన తనిఖీలో గుర్తించిచారు. ఈ విషయాన్ని ఈఓ దృష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

## కొండచిలువ కలకలం

**సాగర్‌నగర్, ఆగస్టు 24 :** సాగర్‌నగర్ ఎల్‌ఐజీ-బి గృహ సముదాయంలో కొండచిలువ శనివారం కలకలం రేపింది. గృహ సముదాయం వద్ద ఉన్న డ్రైనేజీలో సుమారు పది అడుగుల పొడవు ఉన్న కొండచిలువ సంచరిస్తూ.. స్థానికుల కంట పడింది. అది దేనినో మింగి ఎటూ కదల్లేని స్థితిలో అక్కడ ఉన్న ఓ రంధ్రంలో సగం దూరి మిగతా భాగం బయట వుంది. సాయంత్రం వరకు అలానే ఉంది. గృహ సముదాయాలకు సమీపంలో దట్టమైన అడవి ఉండడంతో కాలనీలోకి పాములు తరచూ వస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు.



డ్రైనేజీలో ఉన్న కొండచిలువ